PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR
# నవగీతం
NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 34 | పేజీలు : 8 | శనివారం 27 జూన్ 2026 | వెల : 4/-




## మూడు రోజుల పాటు
# భారీ వర్షాలు



- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఇవాళ, రేపు, ఎల్లుండి భారీ వర్షాలు
- ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ
- మిగిలిన ప్రాంతాల్లో మోస్తరు వానలు పడే అవకాశముందని వెల్లడి
- తెలంగాణలో వాతావరణ పరిస్థితులు

హైదరాబాద్

నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజులు పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవొచ్చని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఇవాళ, రేపు, ఎల్లుండి పలు జిల్లాల్లో భారీ వర్షాలు కూడా కురిసే అవకాశం ఉందని తెలిపింది. రేపు రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈ ప్రభావం ఉండనున్నట్లు ప్రకటించింది. ఈ సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వివరించింది. దీంతో ఆయా ప్రాంతాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఇవాళ ప్రధానంగా మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలకు భారత వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలను - మిగతా3లో



## యూరప్‌లో భానుడి భగభగలు

- ఆసియా దేశాల ఏసీలకు భలే గిరాకీ!
- పశ్చిమ, దక్షిణ యూరప్‌ను అతలాకుతలం చేస్తున్న తీవ్రమైన వేడిగాలులు
- పలు దేశాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, వందలాది మరణాలు నమోదు
- ఏసీలకు అమాంతం పెరిగిన డిమాండ్.. ఆసియా కంపెనీలకు భారీ లాభాలు

## రాష్ట్ర కొత్త సీఎస్‌గా
# సంజయ్ జాజు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు
- కొత్త సీఎస్‌గా 1992 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియామకం
- ఇటీవలే తెలంగాణ క్యాడర్‌కు తిరిగి వచ్చిన సంజయ్ జాజు



హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం నూతన ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సంజయ్ జాజు నియమితుల య్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీఎస్‌గా కొనసాగుతున్న రామకృష్ణారావు ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో సంజయ్ జాజును ప్రభుత్వం నియమించింది. కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్న సంజయ్ జాజును తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ - మిగతా3లో



## దేశ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తా

- ప్రతిపక్ష నేతగా రాహుల్‌కు రెండేళ్లు పూర్తి
- నీట్ సహా రాజ్యాంగ పరిరక్షణ వంటి కీలక అంశాలపై తన పోరాటాన్ని కొనసాగిస్తానని ప్రతిజ్ఞ

## డ్రగ్స్‌పై పోరాటంలో
# ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



- మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుంది
- డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలి
- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది
- సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్

సమాజాన్ని డ్రగ్స్ నాశనం చేస్తాయి. డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల - మిగతా3లో



## ఎవరు ఎక్కువ క్షమాపణలు చెప్పారు

- రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్‌పై రిజిజు సెటైర్
- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపైనా తీవ్రంగా విమర్శించిన బీజేపీ

## ఎస్ఐఆర్‌కు ఏడాది పూర్తి



- 6 కోట్ల ఓట్లు తొలగింపు
- కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియకు ఏడాది పూర్తి
- ప్రక్షాళనలో భాగంగా దాదాపు 6 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించిన ఈసీ


## ప్రభుత్వ ఉద్యోగులకు
# ఉచిత బీమా

- ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం బంపర్ ఆఫర్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం
- ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా - మిగతా3లో



## ఫిలిప్పీన్స్‌లో మరో భారీ భూకంపం

- 6.5 తీవ్రతతో ప్రకంపనలు
- దక్షిణ ఫిలిప్పీన్స్‌ను వణికించిన భూకంపం
- మిందనావోలో 6.5 తీవ్రతతో ప్రకంపనలు
- ఎత్తైన ప్రాంతాలకు పరుగులు తీసిన ప్రజలు

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
27 జూన్ 2026

# దేశ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తా

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా, దేశ ప్రజల కోసం పోరాటం కొనసాగిస్తానని, వారి గళాన్ని అధికార కేంద్రాలకు వినిపిస్తానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. చీజుజు సహా రాజ్యాంగ పరిరక్షణ వంటి కీలక అంశాలపై తన పోరాటాన్ని కొనసాగిస్తానని ప్రతిజ్ఞ చేశారు. వీధుల స్థాయి నుంచి పార్లమెంటు వరకు ప్రజల నమ్మకమే తన అతిపెద్ద బలమన్నారు. లోక్?సభ ప్రతిపక్ష నేతగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ మేరకు ఎక్స్?లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. “నేను లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టి నేటికి రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ రెండేళ్లలో రోజూ ఒకే ఒక్క లక్ష్యానికి అంకితమయ్యాను. అదే ప్రతి భారతీయుడి గళాన్ని అధికార కేంద్రాలకు చేరవేయడం. నీట్ (చీజుజు) అభ్యర్థుల కోసం పోరాటం కావచ్చు, ఎన్నికల అక్రమాలను బయటపెట్టడం కావచ్చు లేదా రాజ్యాంగాన్ని కాపాడటం కావచ్చు. ప్రతి విషయంలోనూ నేను మీకు అండగా నిలిచాను. ఈ రోజు కూడా మీకు అండగా ఉన్నాను, ఎప్పటికీ ఉంటాను. వీధుల నుంచి పార్లమెంటు వరకు మీ నమ్మకమే నా అతిపెద్ద బలం. ఈ ప్రయాణం సుదీర్ఘమైనది. కానీ నా సంకల్పం మాత్రం మారలేదు. మీ కోసం ప్రతి పోరాటాన్ని కొనసాగిస్తాను. జై హింద్. జై రాజ్యాంగం.”



2024 జూన్?లో ప్రతిపక్ష నాయకుడిగా నియమితులైన రాహుల్ గాంధీ భారత పార్లమెంటరీ రాజకీయాల్లో ఒక చారిత్రక మార్పుకు నాంది పలికారు. ఎందుకంటే 16, 17వ లోక్‌సభల కాలంలో ఈ పదవి దశాబ్దం పాటు ఖాళీగా ఉండిపోయింది. పార్లమెంటరీ నిబంధనల ప్రకారం, ప్రతిపక్ష నాయకుడి (రాశ్రీ) పదవిని దక్కించుకోవాలంటే ఒక పార్టీ సభ మొత్తం బలం (543 స్థానాలకు గాను 55)లో కనీసం పదో వంతు స్థానాలను గెలుచుకోవాలి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 99 స్థానాలను గెలుచుకోవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ఈ అర్హతను సాధించింది.

2004లో రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి రాహుల్? గాంధీ చేపట్టిన మొట్టమొదటి అధికారిక రాజ్యాంగబద్ధమైన పదవి ఇదే. అలాగే లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా గాంధీ కుటుంబ సభ్యుడు వ్యవహరించడం ఇది మూడోసారి. అంతకుముందు సోనియా గాంధీ, రాజీవ్ గాంధీ కూడా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులుగా వ్యవహరించారు. రాహుల్? గాంధీ ఐదుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఉత్తర్?ప్రదేశ్?లోని రాయ్‌బరేలీ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నియోజకవర్గానికి గతంలో ఆయన తల్లి సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించారు.

**ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ ఫైర్**

ఇదిలా ఉండగా, మరో పోస్ట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పుట్టినరోజున ఆయనను ప్రశంసించడాన్ని ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ ఆరోపణల తర్వాత తన కేబినెట్ సహచరుడికి శుభాకాంక్షలు తెలిపినా ఆయన, ప్రాణాలు కోల్పోయిన పిల్లల గురించి ఒక్కసారైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. విచ్ఛిన్నమైన వ్యవస్థ, జవాబుదారీతనం వహించడానికి నిరాకరించే ప్రభుత్వం వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలు, భవిష్యత్తు నాశనమయ్యాయని అన్నారు. ఈ జాబితాలోని ప్రతి పేరు ఒక కల, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు ఉన్న బిడ్డది. ఇవన్నీ ఒక విచ్ఛిన్నమైన వ్యవస్థ, పాఠాలు నేర్చుకోవడానికి లేదా జవాబుదారీతనం వహించడానికి నిరాకరించే ప్రభుత్వం వల్ల నాశనమయ్యాయి. ప్రతి ఒక్క విద్యార్థిని గుర్తుంచుకోండి. ప్రధాని మోదీ ధర్మేంద్ర ప్రధాన్ పుట్టినరోజున ఆయనను ప్రశంసించినప్పుడు, ఈ పిల్లల గురించి ఒక్కసారైనా ఆలోచించారా?” అంటూ పార్టీ నేత పవన్? ఖేడా పోస్ట్?ను రాహుల్ గాంధీ ట్యాగ్? చేశారు. ఇందులో నీట్? పేపర్? లీక్? ఆరోపణల తర్వాత మరణించిన 14 మంది విద్యార్థుల పేర్లు ఉన్నాయి.

# ఎవరు ఎక్కువ క్షమాపణలు చెప్పారు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు. ఆయన వ్యాఖ్యలపై చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొంటూ ప్రతిపక్ష నేత రాహుల్ తరచుగా క్షమాపణలు చెబుతున్నారని విమర్శించారు. “తప్పుడు ఆరోపణలు చేసిన తర్వాత ఎవరు ఎక్కువ క్షమాపణలు చెప్పారు రాహుల్ గాంధీ లేదా అరవింద్ కేజ్రీవాల్” అని రిజిజు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారుడు కార్తికేయ చౌహాన్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ హైకోర్టులో విచారం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ మేరకు వ్యాఖ్యానించారు. అంతకుముందు కార్తికేయ చౌహాన్‌పై తాను చేసిన పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ మధ్యప్రదేశ్ హైకోర్టు ముందు విచారం వ్యక్తం చేశారు. 2018లో ఝబువాలో జరిగిన ఒక ఎన్నికల ర్యాలీలో పనామా పేపర్స్ లీక్ కుంభకోణానికి సంబంధించి తన పేరును ప్రస్తావించి, తన ప్రతిష్టను దెబ్బతీశారని కార్తికేయ చౌహాన్ ఆరోపించారు. ఈ మేరకు భోపాల్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో రాహుల్ గాంధీపై పరువు నష్టం ఫిర్యాదు దాఖలు చేశారు.

**రాహుల్ విదేశీ పర్యటనలపైనా బీజేపీ ఫైర్**

మరోవైపు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపైనా బీజేపీ తీవ్రంగా విమర్శించింది. రాహుల్ గాంధీ ఎప్పుడూ సెలవుల మూడ్‌లోనే ఉంటారని ఎద్దేవా చేసింది. పార్లమెంట్, ఎన్నికలు లేదా తన పార్టీకి



అవసరమైనప్పుడల్లా తరచుగా గైర్హాజరవుతారని బీజేపీ శుక్రవారం ఆరోపించింది. తాజాగా రాహుల్ గాంధీ “మరో విదేశీ పర్యటన”లో ఉన్నారని పేర్కొంది. రాశ్రా అంటే ‘లీడర్ ఆఫ్ అపొజిషన్’ కాదని, ‘లీడర్ ఆఫ్ పర్యటన్, పార్టీంగ్’ అంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా వీడియో ప్రకటనలో వ్యాఖ్యానించారు.

“రాహుల్ గాంధీ లీడర్ ఆఫ్ అపొజిషన్ పేరును ‘లీడర్ ఆఫ్ పర్యటన్, పార్టీంగ్’గా మార్చుకోవాలి. ఎందుకంటే ఆయన ఎప్పుడూ చేసేది అదే. పార్టీలు, పర్యాటకం, ప్రయాణాలు. ప్రజలు, పార్లమెంట్‌కు లేదా దేశానికి కూడా ప్రాధాన్యం ఇవ్వరు. ఆయన పర్యాటకానికే మొదటి ప్రాధాన్యం ఇస్తారు. పార్టీకి సంస్థాగత మద్దతు అవసరమైన కీలక సమయాల్లో పారిపోతారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో అందుబాటులో ఉండరు. రాహుల్ గాంధీ నిరంతరం సెలవుల మూడ్‌లో ఉంటారు. ఒకవైపు, ప్రధానమంత్రి మోదీ దేశంలో అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రిగా నిలిచారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా, ప్రభుత్వ అధినేతగా 9,000 రోజులకు పైగా ఆయన ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. దీనినే పని విధానం, సేవా విధానం అంటారు. మరోవైపు రాహుల్ గాంధీ కేవలం సెలవులో ఉన్నందున, ఆయన అత్యధిక కాలం పనిచేసిన ప్రతిపక్ష నాయకుడిగా నిలిచే అవకాశం ఉంది.” రాహుల్ గాంధీ వందలాది విదేశీ పర్యటనలు, యాత్రలు చేపట్టారని, ఈ పర్యటనలకు నిధుల కేటాయింపును పూనావాలా ప్రశ్నించారు. “సాధారణంగా ప్రజలు రెండు ప్రాజెక్టుల మధ్య సెలవు తీసుకుంటారు. రాహుల్ గాంధీ మాత్రం రెండు సెలవు కాలాల మధ్య కొద్దిపాటి సమయం పని కోసం భారతదేశానికి వస్తారు. ఆయన తన విహారయాత్రల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. కానీ విదేశీ పర్యటనలు, ప్రయాణాల కోసం ఈ డబ్బును ఎలా ఖర్చు చేస్తున్నారో లెక్క చెప్పలేకపోతున్నారు. స్పష్టంగా, కొన్ని అనుమానాస్పద సంస్థలే వీటికి నిధులు సమకూరుస్తున్నాయి. అవే అజెండాను నిర్దేశిస్తాయి. అది సాధారణంగా భారత్‌కు వ్యతిరేకమైనదిగా ఉంటుంది. దీనిపై కూడా కాంగ్రెస్, రాహుల్ గాంధీ ఎలాంటి వివరణ ఇవ్వడం లేదు. రాహుల్ గాంధీ మరోసారి విదేశాలకు వెళ్లారు. పార్లమెంటుకు, పార్టీకి, ప్రజలకు ఆయన అవసరం ఉన్నప్పుడు ఆయన కనిపించకుండా పోయి, భారత్‌కు వ్యతిరేకంగా విషం చిమ్ముతారు.” అని పూనావాలా అన్నారు.

# ఎస్ఐఆర్‌కు ఏడాది పూర్తి

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియకు ఏడాది పూర్తయింది. ఈ ప్రక్షాళనలో భాగంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 6 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఎన్నికల సంఘం తొలగించింది. ఈ భారీ తొలగింపులపై ప్రతిపక్షాలు, ఎన్నికల సంఘం మధ్య తీవ్ర మాటల యుద్ధం నడుస్తోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో మూడో దశ ప్రక్షాళన కొనసాగుతోంది. గత ఏడాది జూన్ 24న బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది. బిహార్‌లో ఈ ప్రక్రియ ద్వారా ఏకంగా 65 లక్షల ఓట్లను తొలగించారు. అయితే, పత్రాలు లేవన్న నెపంతో, అధికార బీజేపీకి మేలు చేసేందుకే ఎన్నికల సంఘం ఈ చర్యలకు పాల్పడుతోందని ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించారు. కానీ, ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు ఏకగ్రీవ తీర్పుతో ఎన్నికల సంఘం చేపట్టిన ఈ రివిజన్ ప్రక్రియ రాజ్యాంగబద్ధమైనదేనని స్పష్టం చేసింది. అయితే, ఈ ఓట్ల తొలగింపు ప్రభావం సంక్షేమ పథకాలపై కూడా పడుతోంది. బంగాల్, బిహార్ రాష్ట్ర ప్రభుత్వాలు ఓటర్ల డేటాను సామాజిక భద్రతతో అనుసంధానం చేయడంతో, ఓటు హక్కు కోల్పోయిన వారు ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా దూరమవుతున్నారు. ఈ భారీ ప్రక్షాళన కార్యక్రమం ప్రాముఖ్యతను గుర్తిస్తూ, దీనిని ఎన్?సీఈఆర్?టీ సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాల్లో కూడా చేర్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులను తొలగించడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని అందులో వివరించారు. ఇక గత ఏడాది అక్టోబరు 27న ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్, తమిళనాడు సహా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రెండో దశ ప్రారంభమైంది. దీని ద్వారా ఈ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాను



ఏకంగా 10.2 శాతం మేర కుదించారు. ప్రక్షాళనకు ముందు 50.99 కోట్లుగా ఉన్న ఓటర్ల సంఖ్య 45.81 కోట్లకు పడిపోయింది. అంటే 5.18 కోట్లకు పైగా పేర్లను తొలగించారు. ఇందులో మరణించిన 66,88,000 మంది పేర్లను జాబితా నుంచి తీసేశారు. అత్యధికంగా యూపీలో 25.47 లక్షలు, బంగాల్‌లో 24.16 లక్షల మంది చనిపోయిన వారి ఓట్లను తొలగించారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత మరో 63.16 లక్షల పేర్లను డిలీట్ చేశారు. ప్రస్తుతం (ఎస్ఐఆర్) ప్రక్రియ మూడో దశకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 14న మూడో దశ సవరణ ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఏకంగా 36.73 కోట్ల మంది ఓటర్ల జాబితాలను ఎన్నికల సంఘం నిశితంగా పరిశీలిస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి ఈ మూడో దశ సవరణ ప్రక్రియ పూర్తిగా ముగియనుంది.

**యావత్ దేశాన్ని కుదిపేసిన వివాదం**

బంగాల్‌లోని మాల్దాలో ఎస్ఐఆర్ విధుల్లో పాల్గొన్న ఏడుగురు న్యాయాధికారులను నిర్బంధించిన ఘటన అప్పట్లో యావత్ దేశాన్ని కుదిపేసింది. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడాన్ని నిరసిస్తూ ఆందోళనకారులు ఈ చర్యకు దిగారు. మొదట న్యాయాధికారులతో సమావేశం కావాలని నిరసనకారులు కోరగా, అందుకు అనుమతి నిరాకరించడంతో అధికారులను నిర్బంధించారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అక్కడికి చేరుకొని జ్యుడీషియల్ అధికారులను నిర్బంధం నుంచి విడిపించారు. అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం మండిపడింది. ఇది దురదృష్టకర పరిణామమని ఆవేదన వ్యక్తం చేసింది. దీన్ని ఉద్దేశపూర్వకంగా చేసిన దాడిగా పేర్కొంది. బంగాల్‌లో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని వ్యాఖ్యానించింది. ముగ్గురు మహిళలు సహా ఏడుగురు న్యాయాధికారులను కొన్ని అసాంఘిక శక్తులు నిర్బందించాయని, ఆ రోజు అర్థరాత్రి వరకు తాను స్వయంగా పరిస్థితిని పర్యవేక్షించాల్సి వచ్చిందని స్వయంగా సీజేఐ వెల్లడించారు.

## ఫిలిప్పీన్స్‌లో మరో భారీ భూకంపం..

దక్షిణ ఫిలిప్పీన్స్‌లోని మిండనావో ప్రాంతంలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం, శుక్రవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో రిక్టర్ స్కేలుపై 6.5 తీవ్రతతో ఈ శక్తివంతమైన ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో భయాందోళనకు గురైన తీరప్రాంత ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి, ముందుజాగ్రత్త చర్యగా ఎత్తైన ప్రదేశాలకు పరుగులు తీశారు. అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్), జర్మన్ రీసెర్చ్ సెంటర్ (జీఎఫ్‌జెడ్) నివేదికల ప్రకారం, దవావో రీజియన్‌లోని సారంగానికి 34 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో సుమారు 42 నుంచి 52 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూకంపం ధాటికి దవావో నగరంలోని భవనాలు కంపించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అయితే, ఈ భూకంపం వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారులు ప్రస్తుతానికి ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు. ఇదే ప్రాంతంలో జూన్ 8వ తేదీన 7.8 తీవ్రతతో సంభవించిన పెను భూకంపం నుంచి ప్రజలు ఇంకా కోలుకోకముందే తాజాగా మరోసారి ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఇటీవలి విపత్తు కారణంగా 81 మంది ప్రాణాలు కోల్పోగా, 1,300 మందికి పైగా గాయపడ్డారు. సుమారు 16 లక్షల మంది ఈ ఘటనతో ప్రభావితులయ్యారు. పసిఫిక్ ‘రింగ్ ఆఫ్ ఫైర్’ జోన్‌లో ఉన్న ఫిలిప్పీన్స్‌లో ఇటువంటి భూకంపాలు సంభవించడం సర్వసాధారణం.

## యూరప్‌లో భానుడి భగభగలు...




పశ్చిమ, దక్షిణ యూరప్ దేశాలు ప్రస్తుతం తీవ్రమైన వేడిగాలులతో అట్టుడుకుతున్నాయి. జూన్ నెలలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో, ఎయిర్ కండిషనర్లకు (ఏసీ) అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. ఈ పరిణామం ఆసియాకు చెందిన ఏసీ తయారీ కంపెనీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఉత్తర ఆఫ్రికా నుంచి వీస్తున్న వేడిగాలుల ప్రభావంతో బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాల్లో ఉష్ణోగ్రతలు అసాధారణ స్థాయికి చేరాయి. స్పెయిన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటడంతో పలు దేశాలు రెడ్ అలర్ట్ ప్రకటించాయి. ఈ తీవ్ర వడగాల్పుల కారణంగా జూన్ 21 నుంచి ఒక్క స్పెయిన్‌లోనే సుమారు 212 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. ఫ్రాన్స్, ఇటలీలలోనూ మరణాలు నమోదవుతుం డటంతో ఆసుపత్రులు, వృద్ధాశ్రమాలు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. సాధారణంగా యూరప్ ఖండంలో ఏసీల వినియోగం చాలా తక్కువ. ఫ్రాన్స్‌లో కేవలం 25 శాతం గృహాల్లోనే ఏసీలు ఉండగా, యూరప్ మొత్తంగా చూస్తే ఈ సంఖ్య 20 శాతం లోపే ఉంటుంది. అక్కడి భవన నిర్మాణాలు ప్రధానంగా శీతల వాతావరణానికి అనుగుణంగా రూపొందించబడటంతో, ప్రస్తుతం సంభవిస్తున్న ఉష్ణోగ్రత మార్పులను తట్టుకోలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో, ఏసీల కొనుగోళ్లకు ప్రజలు భారీగా మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా శాంసంగ్, ఎల్‌జీ, మిడియా, మిత్సుబిషి ఎలక్ట్రిక్ వంటి ఆసియా కంపెనీల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ఫ్రాన్స్, స్పెయిన్‌లలో ఏసీల విక్రయాలు ఏకంగా 108 శాతం వృద్ధి చెందగా, జర్మనీలో 37 శాతం మేర పెరిగినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. వాతావరణ మార్పుల నేపథ్యంలో భవిష్యత్తులోనూ యూరప్‌లో ఏసీలకు డిమాండ్ ఇలాగే కొనసాగుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## పాస్‌పోర్ట్ కూడా పౌరసత్వాన్ని నిరూపించకపోతే, మరి ఏ పత్రం చేస్తుంది?

పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర విదేశాంగశాఖ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. కేంద్రం చెబుతున్న విధానం చట్టపరంగా ఒక విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తోందని ఆయన విమర్శించారు. పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు కాదని, ఆధార్ కూడా పౌరసత్వాన్ని నిర్ధరించదని చెబితే, సాధారణ భారతీయుడు తన పౌరసత్వాన్ని ఎలా నిరూపించుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఆ అంశంపై ఉన్న అయోమయాన్ని తొలగించేందుకు చట్టాల్లో సవరణలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్వహించిన ‘పాస్‌పోర్ట్ సేవా దివస్’ సందర్భంగా భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా విదేశీ ప్రయాణానికి ఉపయోగించే పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ధ్రువీకరణ పత్రం కాదని స్పష్టం చేసింది. ఆ ప్రకటన అనంతరం సామాజిక మాధ్యమాలు, రాజకీయ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. దీనిపై శుక్రవారం ‘ఎక్స్’ వేదికగా స్పందించిన శశి థరూర్, కేంద్రం వైఖరిని ప్రశ్నిస్తూ పోస్టు చేశారు. “దశాబ్దాలుగా భారతీయులు పాస్‌పోర్ట్‌ను అత్యంత విశ్వసనీయ ప్రభుత్వ గుర్తింపు పత్రంగా భావిస్తున్నారు. పోలీసు ధ్రువీకరణ, పలు పత్రాల పరిశీలన తర్వాతే పాస్‌పోర్ట్ జారీ చేస్తారు. అలాంటి కఠిన ప్రక్రియ తర్వాత ఇచ్చే పత్రం పౌరసత్వాన్ని నిరూపించదని చెప్పడం చట్టపరమైన వైరుధ్యాన్ని సృష్టిస్తోంది. పాస్‌పోర్ట్ కూడా పౌరసత్వాన్ని నిరూపించకపోతే, మరి ఏ పత్రం చేస్తుంది? ప్రపంచస్థాయి బయోమెట్రిక్ వ్యవస్థతో కూడిన ఆధార్ ఉంది. ప్రభుత్వమే జారీ చేసిన పాస్‌పోర్ట్ కూడా ఉంది. కానీ ఆ రెండింటిలో ఏదీ పౌరసత్వానికి తుది ఆధారం కాదని చెప్పడం వల్ల సాధారణ ప్రజలు పరిపాలనా పరమైన అయోమయంలో పడుతున్నారు” ఇదిలా ఉండగా, ఆధార్ కార్డుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు. ఆధార్ అనేది వ్యక్తి గుర్తింపు, నివాసానికి సంబంధించిన పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ఆధారం కాదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిందని గుర్తు చేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం కోట్లాది మంది భారతీయులు ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఆ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆయన కొన్ని సూచనలు కూడా చేశారు. చట్టాల్లో మార్పులు చేసి, ప్రభుత్వం రద్దు చేయనంత వరకు చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్ లేదా సాధారణ ఆధార్ కార్డును భారత పౌరసత్వానికి తుది ఆధారంగా గుర్తించాలని సూచించారు. అలాగే, భారతీయులు, నివాసితులకు ప్రత్యేక రంగు లేదా ప్రత్యేక గుర్తింపుతో ఉండే ఆధార్ కార్డులను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా జారీ చేయాలని ప్రతిపాదించారు. ఈ విధంగా భారతీయ పౌరులు, పౌరులు కాని వారిని స్పష్టంగా వేరు చేయవచ్చని శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత సాధారణ ఆధార్ కార్డు లేదా చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ప్రభుత్వం గుర్తించవచ్చని చెప్పారు. దీంతో ఎన్నికల జాబితాల సవరణలు వంటి ప్రక్రియల్లో అనవసర వివాదాలు తగ్గుతాయని, పరిపాలనా ప్రక్రియలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. “ఈ రెండు పత్రాల్లో ఏదో ఒకటి ఉంటే భారత పౌరుడిగా గుర్తించే విధానాన్ని అమలు చేస్తే, పౌరసత్వంపై అనవసర చర్చలకు ముగింపు పడుతుంది. ప్రజలకు కూడా తమ గుర్తింపు విషయంలో పూర్తి చట్టపరమైన స్పష్టత లభిస్తుంది” అని శశి థరూర్ తన పోస్టులో పేర్కొన్నారు.

**‘పాస్‌పోర్ట్ ప్రయాణ పత్రం మాత్రమే’**

ఇదిలా ఉండగా, విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం నిర్వహించిన సమావేశంలో భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తుది ఆధారం కాదని వెల్లడించింది. అనంతరం గురువారం కూడా ఆ అంశంపై మరోసారి స్పష్టత ఇచ్చింది. ఇటీవల లేదా గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ఎప్పుడూ ప్రకటించలేదని తెలిపింది. దీనికి ఆధారంగా పాస్‌పోర్ట్ చట్టం-1967లోని సెక్షన్-20ను కేంద్రం ప్రస్తావించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే భారత పౌరుడు కాని వ్యక్తికీ కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చని ఆ సెక్షన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించింది.

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
27 జూన్ 2026

# తెలుగు ఎంపీలే రిచ్చెస్ట్




**హైదరాబాద్ :** అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రాజ్యసభ సభ్యుల ఆస్తుల విలువలో తెలుగు రాష్ట్రాల ఎంపీలదే పైచేయిగా నిలిచింది. దేశవ్యాప్తంగా 226 మంది సిట్టింగ్ ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ. 26,047 కోట్లు కాగా.. అందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 18 మంది ఎంపీల సంపదే 39.39 శాతం అంటే రూ. 10,259 కోట్లు ఉండటం గమనార్హం. ముఖ్యంగా తెలంగాణకు చెందిన ఏడుగురు ఎంపీల ఆస్తులు రూ. 8,310 కోట్లుగా ఉన్నాయి. బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి రూ. 5300 కోట్లతో దేశంలోనే అత్యంత ధనిక ఎంపీగా నిలిచారు. అలాగే తెలంగాణ ఎంపీల్లో 71 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.భారత పార్లమెంట్ ఎగువసభ అయిన రాజ్యసభలో తెలంగాణ ప్రజాప్రతినిధుల హవా నడుస్తోంది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ దేశవ్యాప్తంగా ఉన్న 226 మంది సిట్టింగ్ రాజ్యసభ ఎంపీల ఆర్థిక, నేర, ఇతర నేపథ్యాలపై తాజాగా విడుదల చేసిన నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం రాజ్యసభ సభ్యుల ఆస్తులతో పోలిస్తే.. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 18 మంది ఎంపీల వాటాయే ఏకంగా 39.39 శాతంగా నమోదైంది. ఈ మొత్తం సంపదలోనూ ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణ ఎంపీల ఆస్తులే ఎక్కువ.మొత్తం 226 మంది ఎంపీల ఆస్తుల విలువ రూ. 26,047 కోట్లు కాగా.. అందులో కేవలం తెలంగాణకు చెందిన ఏడుగురు ఎంపీల సంపదే ఏకంగా రూ. 8,310 కోట్లుగా ఉంది. అంటే దేశవ్యాప్త ఎంపీల మొత్తం ఆస్తిలో దాదాపు మూడో వంతు వాటా తెలంగాణ ప్రజాప్రతినిధులదే కావడం గమనార్హం. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 11 మంది ఎంపీల ఆస్తుల విలువ రూ. 1,949 కోట్లుగా ఉంది. నివేదిక ప్రకారం తెలంగాణలో 57 శాతం మంది, ఆంధ్రప్రదేశ్‌లో 45 శాతం మంది ఎంపీలు బిలియనీర్లుగా తేలారురాజ్యసభలో అత్యధిక ఆస్తులున్న తొలి ముగ్గురు ఎంపీలను పరిశీలిస్తే.. అందులో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే కావడం విశేషం. తెలంగాణ నుంచి బీఆర్ఎస్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న బండి పార్థసారథి రూ. 5,300 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక రాజ్యసభ ఎంపీగా మొదటి స్థానంలో నిలిచారు. పంజాబ్‌కు చెందిన బీజేపీ ఎంపీ రాజేందర్ గుప్తా రూ. 5,053 కోట్లతో రెండో స్థానంలో నిలవగా.. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ రూ. 2,558 కోట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. తెలంగాణలో కేవలం ముగ్గురు బీఆర్ఎస్ సభ్యుల ఆస్తి విలువే రూ. 5,524 కోట్లుగా ఉందని ఏడీఆర్ స్పష్టం చేసింది.క్రిమినల్ కేసులు ఉన్న ఎంపీల జాబితాలోనూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. తెలంగాణకు చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యుల్లో ఐదుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో ముగ్గురిపై అత్యంత తీవ్రమైన నేరాల కేసులు ఉన్నట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది. ఈ కేసుల పరంగా దేశంలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, బిహార్, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల కంటే తెలంగాణే ముందంజలో ఉంది. తెలంగాణలో క్రిమినల్ కేసులున్న వారిలో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎంపీలు ఉన్నారు.దేశవ్యాప్తంగా వంద కోట్ల కంటే ఎక్కువ ఆస్తి ఉన్న ఎంపీలు 31 మంది ఉండగా.. అందులో బీజేపీ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఆరుగురు ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్ నుంచి ఇద్దరేసి, జనసేన నుంచి ఒకరు ఈ వంద కోట్ల క్లబ్‌లో ఉన్నారు. పార్టీల పరంగా చూస్తే.. దేశవ్యాప్తంగా బీజేపీ ఎంపీల ఆస్తుల విలువ రూ. 8,181 కోట్లు కాగా.. కాంగ్రెస్ సభ్యులది రూ. 3,781 కోట్లుగా ఉంది. నలుగురు స్వతంత్రులకు రూ. 2,211 కోట్ల ఆస్తులున్నాయి. ఏపీలో టీడీపీకి చెందిన నలుగురు ఎంపీల ఆస్తుల విలువ రూ. 1,007 కోట్లు కాగా.. వైసీపీకి చెందిన నలుగురు సభ్యులకు రూ. 683 కోట్ల విలువైన ఆస్తులున్నాయి.అప్పుల విషయానికి వస్తే.. రాజ్యసభలో అత్యధిక అప్పులున్న తొలి ముగ్గురు ఎంపీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ ఎంపీ భాష్యం రామకృష్ణ రూ. 200 కోట్ల అప్పులతో రెండో స్థానంలో నిలిచారు. ఆయన మె?త్తం ఆస్తులు రూ. 672 కోట్లు. ఝార్ఖండ్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పరిమళ్‌నత్వానీ రూ. 256 కోట్ల అప్పులతో మొదటి స్థానంలో.. జయాబచ్చన్ రూ. 149 కోట్ల అప్పులతో మూడో స్థానంలో ఉన్నారు. కాగా, మొత్తం రాజ్యసభ సభ్యుల్లో మహిళల వాటా కేవలం 15 శాతం అంటే 34 మంది మాత్రమే ఉన్నారని.. అందులోనూ బీజేపీ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి నలుగురు ఉన్నట్లు ఏడీఆర్ తన నివేదికలో వెల్లడించింది.

# వరంగల్‌లో ఇసుక దుమారం




**వరంగల్ :** వరంగల్ జిల్లా పాలిటిక్స్‌లో ఇప్పుడు ఇసుక దుమారం రేగుతోంది. ఇసుక దందాతో ఇద్దరు మంత్రులు వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపిస్తూ అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నంలో ఉంది బీఆర్ఎస్. ములుగు జిల్లాలో ఎప్పుడూ లేనివిధంగా ఇసుక దోపిడీ జరుగుతోందని విపక్షం చేస్తున్న ఆరోపణలు పొలిటికల్ మంటలు పుట్టిస్తున్నాయి. దోపిడీకి సంబంధించి మా దగ్గర డ్రోన్ విజువల్స్, ఇతర ఆధారాలు ఉన్నాయంటూరోజుకో ప్రెస్ మీట్ పెట్టి హడావిడి చేస్తున్నారు గులాబీ నేతలు. అలాగే? దీనికి సంబంధించి సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సందర్భంలో దీనికి కౌంటర్ ఇవ్వడంలో జిల్లా కాంగ్రెస్ నేతలు విఫలమవుతున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. ఇద్దరు మంత్రులు అంటూ? బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంపై కేవలం ములుగు జిల్లా పార్టీ నేతలు మినహా? కాస్తంత హోదా ఉన్న, పెద్ద నాయకులు ఎవరూ ఎందుకు రియాక్ట్ అవడం లేదన్న చర్చలు హాట్‌హాట్‌గా నడుస్తున్నాయి. రాష్ట్ర మంత్రులు ఇద్దరు కలిసి ములుగు జిల్లా పరిధిలోని గోదావరి ఇసుకను మింగేస్తున్నారంటూ డైరెక్ట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీతమ్మ సాగర్‌లో అక్రమంగా ఇసుక తవ్వి దాదాపు 4 వేల కోట్ల రూపాయలు వెనకేసుకునేందుకు మంత్రులు ఇద్దరూ ప్రయత్నిస్తున్నారన్నది కేటీఆర్ ఆరోపణ. ఇసుక మాఫియా సూత్రధారులను బయటకు లాగాలన్నది ఆయన డిమాండ్.దీనికి సంబంధించి ములుగు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు గులాబీ నేతలు. ఇలా ఇసుక దోపిడీ పేరుతో అధికార పక్షాన్ని ఇరుకునపెట్టేలా బీఆర్ఎస్ నేతలు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నా. అధికార పక్షం నుంచి గట్టిగా తిప్పికొట్టే ప్రయత్నం మాత్రం జరగడంలేదని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం ములుగు నాయకులు, అందునా ఒక మంత్రి అనుచరగణం తప్ప? ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏ ముఖ్య నేతా ఎందుకు స్పందించలేదన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఆ విషయంలో కాంగ్రెస్ వాళ్ళు ఎందుకు వెనకడుగు వేస్తున్నారంటూ ఎవరికి వారు రకరకాల విశ్లేషణల్లో మునిగిపోయారు. ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు అశోక్, జిల్లా పార్టీలోని కొందరు నాయకులు మాత్రమే బీఆర్ఎస్ ఆరోపణలకు రియాక్ట్ అయి నిరూపించమంటూ సవాల్ విసిరారు. మిగతా మంత్రులు, ఎమ్మెల్యేల సంగతి తర్వాత? కనీసం ఉమ్మడి వరంగల్ పరిధిలో ఇప్పుడున్న మిగిలిన ఐదు జిల్లాల డీసీసీ అధ్యక్షులు కూడా మినిస్టర్స్ మీద వస్తున్న ఇసుక ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదన్నది ఆలోచించాల్సిన విషయమేనని అంటున్నారు రాజకీయ పరిశీలకులు. ఇసుక తవ్వకాలకు సంబంధించిన అనుమతుల విషయంలో ఎక్కడా తప్పు జరగలేదని, మంత్రులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా వ్యవహరించలేదని కాంగ్రెస్ నేతలు గట్టిగా ఎందుకు చెప్పలేకపోతున్నారన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి.ఇందుకు సమాధానంగా వినిపిస్తున్న కొన్ని మాటలు కాంగ్రెస్ పార్టీలోని ప్రస్తుత పరిస్థితి ప్రతిబింబిస్తున్నాయని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. ఏం మాట్లాడితే ఏమవుతుందోనన్న భయంతోనే ఎక్కువ మంది కామ్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. చేతిలో పూర్తి సమాచారం లేకుండా. ఏదో, మంత్రుల్ని వెనకేసుకుని రావాలి కాబట్టి నోటికొచ్చింది మాట్లాడేస్తే రేపు మనం ఇరుక్కుపోతామన్న భయం వాళ్ళలో ఉందట. అందుకే ఇసుక ఆరోపణల విషయంలో మంత్రులు ఇద్దరికీ బాసటగా నిలవలేకపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు మంత్రుల నుంచి కూడా మనం కరెక్ట్‌గానే ఉన్నాం, మీరు ఖండించండన్న గ్రీన్ సిగ్నల్ కూడా రాలేదని అంటున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అధిష్టానం సైతం ఈ విషయంపై నేతలకు క్లారిటీ ఇవ్వకపోవడం వల్ల ఇసుక దందా అంశాన్ని పట్టించుకోకుండా ఎవరికి వారు తమ పని తాము చేసుకుంటూ వెళ్తున్నారట. కానీ? విపక్షం ఆరోపణలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళక ముందే మేలుకుని ప్యాచ్‌వర్క్ చేయకుంటే నష్టపోవాల్సిన పరిస్థితులు వస్తాయన్న టెన్షన్ కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది.

## ఢిల్లీలో తెలంగాణకు స్థలం కరువు

**హైదరాబాద్ :** దేశ రాజధానిలో తెలంగాణకు కేరాఫ్ లేకుండా పోతోందా? ప్రస్తుతం ఏపీ మంచితనం మీద ఆధారపడాల్సి వస్తోందా? వాళ్ళు ఎప్పుడు ఖాళీ చేయమంటారోనని తెలంగాణ అధికారులు కంగారు పడుతున్నారా? ఏ విషయంలో అంత టెన్షన్ పడుతున్నారు? రాష్ట్ర విభజన జరిగిన 12 ఏళ్ళ తర్వాత కూడా ఆ సమస్యలు ఎందుకు వస్తున్నాయి? ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకకు నిర్మాణానికి అడ్డుపడుతున్నదేంటి? ఢిల్లీలో తెలుగోళ్ళకు కేరాఫ్ ఆంధ్ర భవన్. సెంట్రల్ ఢిల్లీలో అదీ, ఇండియా గేట్‌కు అత్యంత దగ్గరగా ఉన్న ఈ బిల్డింగ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఓ వెలుగు వెలిగింది. అయితే విభజన తర్వాత ఆస్తుల పంపకాల్లో భాగంగా ఆంధ్ర భవన్ ను తాత్కాలికంగా విడగొట్టుకుని ఒకే బిల్డింగ్‌లో రెండు రాష్ట్రాలు అడ్మినిస్ట్రేషన్‌ను కొనసాగిస్తున్నాయి. అందుకే ప్రస్తుతం ఢిల్లీలోని ఈ భవన్‌ను చూస్తే గమ్మత్తుగా కనిపిస్తోందని అంటుంటారు చాలామంది. దీనికి ఒకవైపు ఆంధ్ర , మరో వైపు తెలంగాణ అని పక్క పక్కనే బోర్డ్స్ కనిపిస్తూ ఉంటాయి. పైగా రెండు రాష్ట్రాల ఢిల్లీ భవన్స్ ఒకే బిల్డింగ్‌లో ఉండడంతో వాళ్ళని వీళ్లు, వీళ్లని వాళ్ళు? మెయింటెనెన్స్‌ను పూర్తిగా గాలికొదిలేశారు. దాంతో ఘనంగా చెప్పుకోవాల్సిన ఆంధ్ర, తెలంగాణ భవన్లు ప్రస్తుతం గందరగోళంగా కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో సెక్రటేరియెట్‌కు ఎంతటి ప్రాముఖ్యత ఉంటుందో, ఢిల్లీలో ఉండే రాష్ట్రాల భవన్లకు అంత ఇంపార్టెన్స్ ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిలా? ఢిల్లీలో రెసిడెంట్ కమిషనర్లు, ప్రోటో కాల్ అధికారులు ఉంటారు. ముఖ్యమంత్రి, చీఫ్ సెక్రటరీ, ఉన్నతాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సైతం ఢిల్లీ ట్రిప్‌కు వచ్చినప్పుడు భవన్లోనే బస చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో?. తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక, భవన్ విభజనపై క్లారిటీ వచ్చింది, పంపకాలు జరిగాయి. ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ మొత్తం ఆంధ్ర వాటా కింద వెళ్ళింది. ఆ ఒప్పందం ప్రకారం పటౌడీ హౌజ్‌లో ఉన్న ఖాళీ స్థలంలో తెలంగాణ భవన్ నిర్మాణం జరగాలి.కానీ? నిర్మాణం ఆలస్యం అవుతూ వస్తోంది. నిజం చెప్పాలంటే ప్రస్తుతం ఆంధ్ర భవన్‌లోనే తెలంగాణ భవన్ కొనసాగుతోంది. ఇది ఇలాగే ఉంటే ఏదో ఒకరోజున ఆంధ్ర వాళ్ళు ఖాళీ చేసి పొమ్మంటే మా పరిస్థితి ఏంటంటూ తెలంగాణ అధికారులు టెన్షన్ పడుతున్నారట. ఢిల్లీ భవన్ విభజన తర్వాత ఏపీకి 11.5 ఎకరాలు, తెలంగాణకు 8.2 ఎకరాలను కేటాయించారు, విభజన ప్రక్రియ మొత్తం కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ప్రస్తుతం ఢిల్లీలో తెలుగు రాష్ట్రాలకు ఉన్న స్థలం 19.7 ఎకరాలు. దాని విలువ 9వేల 913.505 కోట్లు ఉంటుంది. ఇది కూడా కేంద్ర హోంశాఖ చెప్పిన లెక్కే. వాస్తవానికి ఢిల్లీలో బహుళ అంతస్తుల నిర్మాణం కట్టాలంటే ప్రాసెస్ చాలా పెద్దది. మొదట ప్లాన్ రెడీ చేసి అనుమతులను కేంద్రం నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. దాని ప్రకారం ఇప్పటికే ప్లాన్ సిద్ధం చేసుకున్న తెలంగాణ సర్కార్ నిధులు కేటాయించి.. నిర్మాణం కోసం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ? ఆ విషయంలో ఆలస్యం అవుతోంది. దాంతో? దేశ రాజధానిలో రాష్ట్రానికి కేరాఫ్‌గా నిలవాల్సిన భవనం లేకపోవడం ఇబ్బందిగా మారుతోంది.

## రాష్ట్ర కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు

-మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది. కొత్త ప్రధాన కార్యదర్శి పోస్టుకు సంజయ్ జాజుతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ పేరును కూడా సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. చివరికి సంజయ్ జాజు వైపే ఆయన మొగ్గు చూపారు.

**2014 నుంచి కేంద్ర సర్వీసులో**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. 1992 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు, కేంద్ర సర్వీసు నుంచి ఇటీవలే తెలంగాణ క్యాడర్‌కు తిరిగి వచ్చారు. ప్రారంభంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్?లోని విజయవాడ సబ్ కలెక్టర్‌గా, పశ్చిమగోదావరి కలెక్టర్‌గా, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా పని చేశారు. 2014 నుంచి కేంద్ర సర్వీసులో ఉన్నారు. సంజయ్ జాజు 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో ఉండనున్నారు.

**సంజయ్‌జాజుకు అదనపు బాధ్యతలు**

పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక సీఎస్‌గా సంజయ్‌జాజుకు అదనపు బాధ్యతలు అప్పగించనున్నారు. సీఎంవోలోని స్పీడ్ విభాగం సీఈవోగా, పరిశ్రమలు-పెట్టుబడుల విభాగం ప్రత్యేక కార్యదర్శిగా సంజయ్ జాజుకు అదనపు బాధ్యతలు అప్పగించనున్నారు. కాగా సీఎస్‌గా పదవీ విరమణ చేయనున్న కె.రామకృష్ణారావును ముఖ్యమంత్రి సలహాదారుడిగా నియమించనున్నారు.

**13 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ**

మరోవైపు రాష్ట్రంలో 13 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. చేనేత హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ నియామకమయ్యారు. విపత్తు నిర్వహణ ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియామకం కాగా, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్, గనుల శాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె.చంద్రకళ, చేనేత, హస్తకళల జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బి.అజిత్ రెడ్డి, టీజీ రెడ్కో వీసీఎండీగా ముషారఫ్ అలీ ఫారుఖీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శిగా కె.గంగాధర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా టి.వెంకన్న, పర్యాటక శాఖ డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్ నియమితులయ్యారు.

## మూడు రోజుల పాటు భారీ వర్షాలు

-మొదటిపేజీ తరువాయి

జారీ చేసింది. ఉత్తర తెలంగాణలో రేపు, ఎల్లుండి కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది.

**దంచి కొట్టిన వర్షం**

పలు జిల్లాల్లో గురువారం వానలు దంచి కొట్టాయి. అత్యధికంగా నిర్మల్ జిల్లా నర్సాపూర్? మండలంలో 5.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. యాదాద్రి భువనగిరిలోని రామన్నపేటలో 3.1 సెంటీమీటర్లు, నిజాంసాగర్ మండలంలోని హసన్ పల్లిలో 2.7 సెంటీమీటర్ల మేర కురిసింది. సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ, సిద్దిపేట తదితర జిల్లాల్లో ఓ మోస్తరు కురిశాయి. కాగా, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వాన పడింది. మాదాపూర్, మియాపూర్, చార్మినార్, చందానగర్, లింగంపల్లి ప్రాంతాల్లో మోస్తరు జల్లులు కురిశాయి.

**రేపు రాష్ట్ర వ్యాప్తంగా కురిసే అవకాశం**

రేపు ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్?గిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఐఎమ్‌డీ ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది.

**పలు రాష్ట్రాలకు విస్తరిస్తున్న నైరుతి**

దేశ వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుకుగా కదిలే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ క్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం, రానున్న మూడు నుంచి నాలుగు రోజుల్లో మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ నుంచి మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాయని తెలిపింది. అలాగే క్రమంగా ఝార్ఖండ్ మీదుగా బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల వరకు నైరుతి రుతుపవనాలు విస్తరించే అవకాశముందని అంచనా వేసింది.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన**

ఈ వర్ష ప్రభావంతో దేశవ్యాప్తంగా కొద్ది మేరకు వర్షాల తీవ్రత పెరగనుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల్లో విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎండీ ప్రకటించింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని స్పష్టం చేసింది. అయితే, కర్ణాటకలో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశముందనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది.

## ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత బీమా

-మొదటిపేజీ తరువాయి

రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి విక్రమార్క వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ.10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు. కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాకుండా..నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు.?తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. ?గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళ్లు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ ఈఎంఐలు, కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది.మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగుల హక్కులను కాపాడాలి అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు.

## డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

-మొదటిపేజీ తరువాయి

నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## సంపాదకీయం

# త్రిశూల్ వ్యూహంలో ఎన్డీఏ

నాలుగోసారి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. త్రిశూల వ్యూహంతో పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సర్, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో ప్రత్యర్థులను ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తోంది. బీహార్, బెంగాల్‌లో అనుసరించిన ఫార్ములానే?2029 ఎన్నికల్లో అమలు చేసేందుకు రెడీ అవుతోంది. ఇదే ఇవాళ్టి స్టోరీ బోర్డు. దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. ఇక్కడ ఎన్నికలదే కీలక పాత్ర. అలాంటప్పుడు ఓటర్ల విషయంలో వారి అర్హతలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవటం చాలా అవసరం. ఈ ఉద్దేశంతోనే సర్ ప్రక్రియకు రూపకల్పన జరిగింది. కాకపోతే ఇప్పుడు జరుగుతున్నది సర్ కాదు ఓట్ల చోరీ అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈసీ మాత్రం అవన్నీ అపోహలేనని కొట్టిపారేస్తోంది.దేశంలో ఓటర్ల జాబితాను అప్పుడప్పుడూ సవరించడం తప్పనిసరి. అర్హులకు చోటు కల్పించి అనర్హులపై వేటు వేసేందుకు సర్ నిర్వహించడమూ అవసరమే. దీని పై ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండనవసరం లేదు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి ప్రజాప్రాతినిధ్య చట్టం -1951 పూర్తి స్వేచ్ఛను కల్పించింది. ఈసీ ఈ విషయం లో ఎవరి అనుమతి తీసుకోవాల్సిన లేదా ఎవరికీ జవాబుదారీ వహించాల్సిన అవసరం లేదు. దేశంలో ఇలాంటివి జరగడం ఇదే కొత్త కూడా కాదు. 1952 నుంచి 2004 వరకు 13 సార్లు సర్ జరిగింది. కానీ, ప్రస్తుత సర్వే స్థాయిలో అవేవీ వివాదాల్లో చిక్కుకోలేదు. అయితే ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కొడిగట్టిన ప్రస్తుత తరుణంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది. సర్ పేరిట జరుగుతున్న తతంగమంతా బీజేపీకి సానుకూలత, విపక్షాలకు ప్రతికూలత కల్పించేందుకేనని, అందుకు కృత్రిమమైనరీతిలో చేర్పులు, ప్రక్షాళనలు జరుగుతున్నాయని ప్రధానమైన ఆరోపణ. పనిలోపనిగా పౌరసత్వ పరీక్షలూ జరుగుతున్నాయనేది మరో ఆరోపణ.దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికల సంఘం సర్వే చేపట్టింది. అందులోనూ మొదటి విడతగా బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించడంపై ఇప్పటికే తీవ్ర దుమారం చెలరేగింది. మార్పుల తర్వాత జాబితాలో 50 లక్షలకు పైగా ఓటర్ల పేర్లు గల్లంతు కావడంపై పార్లమెంటు కూడా దద్దరిల్లింది. ఈ వివాదం ఒక కొలిక్కి రాకుండానే దేశమంతటా సర్ కార్యక్రమం చేపట్టనున్నట్టు ఎన్నికల కమిషన్ గత అక్టోబర్ 27న ప్రకటించింది. దీనిపై విపక్ష పాలిత రాష్ట్రాలు తీవ్ర వ్యతిరేకత తెలిపాయి. ముఖ్యంగా తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రతిఘటించి తీరుతామని శపథం పూనాయి. కానీ తీవ్ర నిరసనల మధ్యే సర్ ప్రక్రియ పూర్తయింది. ఎన్నికల్లో తమ ఓటమికి సర్ తోనే పునాది పడిందని బెంగాల్లో మమతా బెనర్జీ సుప్రీందాకా వెళ్లి మరీ ప్రతిఘటించారు. దీంతో సుప్రీంకోర్టు సర్ ప్రక్రియ కోసం జ్యుడీషియల్ అధికారులను నియమించింది. చివరకు వారిని కూడా ఘెరావ్ చేసే దుస్థితి రావడం, తమ ఆదేశాల్ని కూడా బెంగాల్ రాష్ట్ర యంత్రాంగం బేఖాతరు చేయడాన్ని సుప్రీం తీవ్రంగా పరిగణించింది. కేంద్ర బలగాల రక్షణలో సర్ జరగాల్సిందేనని, సర్‌కు ఎక్కడైనా ఆటంకాలు ఎదురైతే చూస్తూ ఊరుకునేది లేదని సుప్రీంకోర్టు హెచ్చరించింది. సర్ నిబంధనల మేరకు జరగకపోతే ఆధారాలతో ఫిర్యాదు చేయొచ్చు కానీ.. అసలు ప్రక్రియనే వద్దనడం పద్ధతి కాదని సర్వోన్నత న్యాయస్థానం పార్టీలకు తలంటింది.ఉత్తరప్రదేశ్ సర్‌లో ఏకంగా సుమారు 20 శాతం ఓటర్ల పేర్లు, అంటే 2.89 కోట్ల ఓట్లు గల్లంతవడం కలకలం రేపింది. రాష్ట్రంలోని మొత్తం ఓట్ల సంఖ్య 15.44 కోట్ల నుంచి 12.55 కోట్లకు తగ్గిపోయింది. ఇక రాజధాని లక్నోలో 39.9 లక్షల ఓట్లుంటే అందులో 30 శాతం సర్వేలో ఎగిరిపోయి చివరకు 27.9 లక్షలే మిగిలాయి. అందులో కొందరు ఓటర్లు చనిపోయారని, మరికొందరు వేరే ప్రాంతాలకు వలసపోయారని, ఇంకొందరి పేర్లు రెండు లేదా అంతకంటే ఎక్కువచోట్ల ఉన్నాయని కమిషన్ వివరణ ఇచ్చింది. ఏదేమైనప్పటికీ భారీ స్థాయిలో ఓట్ల తొలగింపుపై రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సర్ కార్యక్రమం వల్ల ఓటర్లలో కొన్ని వర్గాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయని ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ ఆరోపించింది.సర్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో తమిళనాడు న్యాయపోరాటానికి దిగింది. ఎన్నికల సంఘం చేపట్టిన సవరణకు ఎలాంటి రాజ్యాంగ బద్ధత, చట్టబద్ధత లేదని, పారదర్శకత, సమన్యాయం లోపించాయని ఆరోపించింది. బెంగాల్‌లో ఏకంగా నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్‌కు సర్ యంత్రాంగం విచారణ నోటీసు పంపించడంపై వివాదం రేగింది. దేశ విభజన నుంచి బంగ్లా యుద్ధం దాకా అనేక చారిత్రక కారణాల వల్ల బెంగాల్‌లో పౌరసత్వ సమస్యలున్నాయి. సర్ పేరిట దొడ్డిదారిన సిటిజన్‌షిప్ రిజిస్టర్‌ను ప్రవేశపెడుతున్నారని టీఎంసీ మండిపడింది. ఈ వివాదాల వెనుక నిజానిజాల మాట అటుంచితే, ప్రజలకూ, పార్టీలకూ సర్‌పై అంతులేనన్ని అనుమానాలున్నాయన్న మాట నిజం. పార్టీలు ఎప్పుడూ లేని విధంగా ఎన్నికల సంఘంపై కూడా నమ్మకం ఉంచటం లేదు. అయితే బెంగాల్ సర్ విషయంలో అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని అడిగితే.. ఏ పార్టీ నుంచీ స్పందన రాలేదు. కనీసం తుది జాబితాపై అభ్యంతరాలు అడిగినా.. ఎవరూ ముందుకు రాలేదు. తగినంత సమయం ఇచ్చిన తర్వాత కూడా ఎలాంటి స్పందన లేకపోవడంతో.. సర్‌ను రాజకీయ వివాదంగా మార్చొద్దని సుప్రీంకోర్టు చెప్పాల్సి వచ్చింది.ప్రస్తుతం తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ.. సర్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌ను పీసీసీ కోరింది. రాష్ట్రంలో ఎన్నికలకు ఇంకా రెండేళ్లకు పైగా సమయం ఉన్నందున ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా 2-3 నెలల్లో హడావిడిగా ముగించకుండా, ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని సూచించింది. సర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకోవడానికి గడువును 3 నెలలకు పెంచాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే జనగణన ప్రక్రియ జరుగుతున్నందున దాంతోపాటే సర్ నిర్వహిస్తే.. సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళ కూడా ఉంది. బూత్ లెవెల్ అధికారులు ప్రత్యక్షంగా 3-4 సార్లు ప్రతి ఇంటికి వెళ్లి ఓటు తనిఖీ చేయాలి. విదేశీయులు ఉన్నారనే నెపంతో ఓట్లు తొలగించే ప్రక్రియ సరికాదనే సూచనలు వస్తున్నాయి.ఓటర్ల జాబితాలో పారదర్శకత కోసం సర్ అవసరమే అనే వాదనతో అన్ని పార్టీలూ ఏకీభవిస్తున్నాయి. కానీ సర్ ప్రక్రియకు ఎంచుకుంటున్న సమయం, సందర్భంపై మాత్రం భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. ఇక్కడ అవకతవకలు ఉన్నాయా.. లేదా అనేది పక్కనపెడితే.. అసలు అనుమానాలు కలిగేలా ఎందుకు వ్యవహరించాలనే ప్రశ్నకు మాత్రం కచ్చితంగా జవాబు వెతకాల్సిందే. అటు పార్టీలు,ఇటు ఓటర్లు అందరిలోనూ నమ్మకం కలిగించే విధంగా ఈసీ విధానాలకు పదునుపెట్టాలనే సలహాలు వస్తున్నాయి. అనవసర ఆందోళనలు, వివాదాలకు తావివ్వకుండా.. ఎవ్వరూ వేలెత్తిచూపటానికి వీల్లేని విధంగా తెలుగు రాష్ట్రాల్లో సర్ జరగాలనే భావన వ్యక్తమవుతోంది. అయితే మన దగ్గర బీహార్, బెంగాల్ మాదిరి రగడకు ఆస్కారం లేదని, ఇక్కడ చాలావరకు ఓటర్లకు సరైన పత్రాలుంటాయనే అభిప్రాయాలు కూడా

# పగబట్టిన ప్రకృతి!



శతాబ్ద కాలంలో ఎన్నడూ చవిచూడని పెను ఉత్పాతం గురువారం (స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి) వెనెజులాపై విరుచుకుపడింది. సెకన్ల వ్యవధిలో రెండుసార్లు వచ్చిన భూకంపాలు-- మొదట రిక్టర్ స్కేల్‌పై 7.2 తీవ్రతతో, అటుపై 7.5 తీవ్రతతో--ఆ దేశాన్ని కాటేశాయి. వెంటవెంటనే ఇంత తీవ్రతతో భూకంపాలొస్తే జన నష్టం, ఆస్తి నష్టం అపారంగా ఉండే అవకాశాలుంటాయి. అటుపై వరసగా 30 సార్లు ప్రకంపనలు వచ్చాయంటే అదెంత భయానకమో ఊహించవచ్చు. దీంతోపాటే అమెరికాలోని కాలిఫోర్నియాలో, జపాన్‌లో సైతం భూకంపాలు రావటం ప్రపంచవ్యాప్తంగా చాలా మందిని భయపెట్టింది. వీటికితోడు కశ్మీర్‌లో కూడా స్వల్పంగా భూమి కంపించింది. భూ అంతర్భాగంలో ఏదో చోటు చేసుకోవటం వల్లే ఇలా జరిగిందన్న ఆందోళన కలిగినా ఇవి యాదృచ్ఛికమైనవేనని శాస్త్రవేత్తలు తేల్చారు. జపాన్‌లో ఎప్పుడూ భూకంపాల తాకిడి ఎక్కువ గనుక అక్కడ కూడా 7.2 తీవ్రతతో భూకంపం వచ్చినా పెద్దగా నష్టం కలగలేదు. ఇక వెనెజులా భూకంపానికి సంబంధించి అధికారిక లెక్కల ప్రకారం ఇంత వరకూ మృతుల సంఖ్య వందల్లోనే ఉన్నా... శిథిలాలు తొలగించాక ఇది వేలల్లోకి చేరినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. స్వల్ప వ్యవధిలోనే భూకంపాలు రావటంతో తప్పించుకునే వ్యవధి లేక చాలామంది శిథిలాల్లో చిక్కుకున్నారు. పీడ పోకుండానే పిశాచం పట్టుకున్న చందాన వెనెజులా వరస కష్టాలు ఎదుర్కొంటున్నది. ఈ ఏడాది జనవరిలో అమెరికా మెరైన్ దళాలు దాడి చేసి దేశాధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌లను అపహరించి తమ దేశానికి తరలించాయి. ఇప్పుడు మదురోపై విచారణ ప్రహసనం నడుస్తోంది. అంతకు చాన్నాళ్ల ముందే అమెరికా ఆంక్షల చట్రంలో ఊపిరాడని దేశ ఆర్థిక వ్యవస్థ 2013 తర్వాత మరింత దెబ్బ తింది. చమురు నిల్వల్లో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా ఉన్న వెనెజులా అమెరికా పీడ లేకుంటే అత్యంత సంపన్నవంతమైన దేశంగా నిలిచేది. కానీ భారీ ద్రవ్యోల్బణం, అవినీతి, అమెరికా ఆర్థిక ఆంక్షల పర్యవసానంగా దాని జీడీపీ 80 శాతం పడిపోయింది. ఇప్పుడు తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్యూజ్ నేతృత్వంలోని ప్రభుత్వం అమెరికా కనుసన్నల్లో నడుస్తోంది. దీర్ఘకాలంగా ఉన్న 24,000 కోట్ల డాలర్ల రుణ చెల్లింపును పునర్వ్యవస్థీకరించాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్)ను ఆ దేశం కోరింది. ఈ రెండు భూకంపాలవల్లా దేశ ఆర్థికవ్యవస్థకు దాదాపు పదివేల కోట్ల డాలర్ల వరకూ నష్టం సంభవించి ఉండొచ్చని అమెరికా భౌగోళిక సర్వే అంచనా వేస్తోంది. ఆంక్షల వల్ల దశాబ్దాలుగా మౌలిక సదుపాయాల్ని మెరుగుపరచటం ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. వంతెనలూ, రోడ్లు, ఆసుపత్రులు, విద్యుత్ గ్రిడ్‌లు కాలం చెల్లినవి కావటంతో అవి భూకంపం తాకిడికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇతరేతర విపత్తులు ముందస్తు సూచనలు అందించి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లడానికి వీలుగా మనిషికి కొద్దిపాటి వ్యవధినిస్తాయి. కానీ భూకంపాలు ఎలాంటి సూచనా అందించవు. ఏం జరిగిందో గ్రహించే లోగానే శిథిలాల గుట్టలతో భీతావహుల్ని చేస్తాయి. ఈసారి కొంత నయం. ఆండ్రాయిడ్ స్మార్ట్ ఫోన్‌లో ఉండే యాక్సెలెరోమీటర్ అనే సెన్సర్ అయిదు, పది సెకన్ల ముందు హెచ్చరించటంతో చాలామంది అప్రమత్తమై భారీ భవంతులనుంచి దూరం జరిగి ప్రాణాలు కాపాడుకున్నారు. భూకంపం బయలు దేరినప్పుడు మొదట విడుదలై శరవేగంతో విస్తరించే పీ--వేవ్స్ (ప్రాథమిక తరంగాలు)ను ఆ సెన్సర్ పసిగడుతుంది. ఒకే ప్రాంతంలో అనేక ఫోన్లు ఈ పనిచేసినప్పుడు గూగుల్ క్లౌడ్ సర్వర్‌లోని అల్గారిథమ్ వెనువెంటనే అన్ని ఫోన్లకూ హెచ్చరిక సందేశాన్ని విడుదల చేస్తుంది. 'భూకంపాల క్రియాశీల దశ'లోకి భూమి చేరుకుని ఉండొచ్చని పదేళ్లక్రితం భూభౌతిక శాస్త్రవేత్తలు అనుమానాలు వ్యక్తం చేశారు. దానిపై ఇంతవరకూ నిర్ధారణగా చెప్పిందేమీ లేదుగానీ...దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రపంచ దేశాలన్నీ ముందు జాగ్రత్తలు తీసుకోవటం మేలు. జపాన్ ఈ విషయంలో చాలా ముందంజలో ఉంది గనుక, ఇతర దేశాలు దాన్ని అనుసరించాలి. అలాగే ప్రకృతికి చేటుతెచ్చే విధానాలు కట్టిపెట్టాలి. ఉన్నంతలో పర్యావరణహిత విధానాలు అనుసరిస్తే ఇలాంటి విపత్తులకు ఆస్కారం తక్కువ ఉంటుంది.

# నిజంగానే భారత్ ఆర్థిక సంక్షోభంలో ఉందా?



భారత ఆర్థిక వ్యవస్థ గురించి ప్రస్తుతం రెండు విభిన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఒకటి-- ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ దూసుకుపోతోందనే వాదన. మరొకటి-- నిరుద్యోగం, ధరల భారం, ఆదాయ అసమానతలతో సామాన్య ప్రజలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారనే విమర్శ. ఈ రెండిటిలో ఏది నిజం? ప్రస్తుతం భారత్‌ను ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశంగా పేర్కొనడానికి అవసరమైన పరిస్థితులు కనిపించడం లేదు. ఆర్థిక సంక్షోభం అంటే-- వృద్ధిరేటు కుప్పకూలడం, విదేశీ మారక నిల్వలు క్షీణించడం, కరెన్సీ విలువ తీవ్రంగా పడిపోవడం, బ్యాంకింగ్ వ్యవస్థ దెబ్బతినడం, ద్రవ్యోల్బణం అదుపు తప్పడం వంటి లక్షణాలు ఒకేసారి కనిపించాలి. కానీ అలాంటి పరిస్థితి లేదు. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఆర్బీఐ అంచనాల ప్రకారం భారత ఆర్థిక వృద్ధి రేటు 6శాతం కంటే ఎక్కువగా కొనసాగుతోంది. అమెరికా, జర్మనీ, జపాన్, బ్రిటన్ వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు మందగమనాన్ని ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ స్థాయి వృద్ధిని కొనసాగించడం గమనార్హం. దేశ జీడీపీ ఇప్పటికే నాలుగు ట్రిలియన్ డాలర్ల మార్కును దాటగా, వచ్చే కొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించే అవకాశం ఉందని అంతర్జాతీయ సంస్థలు అంచనా వేస్తున్నాయి. అయితే జీడీపీ పెరుగుదల మాత్రమే ఆర్థిక ఆరోగ్యానికి పూర్తి సూచిక కాదు. అసలు ప్రశ్న ఏమిటంటే.. ఈ వృద్ధి ఫలితాలు ఎంతమంది ప్రజల జీవితాల్లో కనిపిస్తున్నాయి? ఇక్కడే భారత ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన వైరుధ్యం బయటపడుతోంది. దేశ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిల్లో ఉన్నాయి. కార్పొరేట్ లాభాలు పెరుగుతున్నాయి. విదేశీ పెట్టుబడులు కొనసాగుతున్నాయి. మౌలిక సదుపాయాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. కానీ అదే సమయంలో విద్య, వైద్యం, గృహనిర్మాణం, ఆహార వ్యయాలు మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. అధికారిక ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉన్నప్పటికీ, కుటుంబాల నెలవారీ ఖర్చులు మాత్రం తగ్గడం లేదు. అందుకే గణాంకాలు ఒకటి చెబితే, ప్రజల అనుభవాలు మరొకటి చెబుతున్నాయి. భారత్ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు నిరుద్యోగం కంటే నాణ్యమైన ఉపాధి కొరత. ప్రతి సంవత్సరం కోట్లాది మంది యువత ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నా, వారి విద్యార్హతలకు తగిన ఉద్యోగాల సృష్టి జరగడం లేదు. ఉన్నత విద్య పూర్తి చేసిన అనేక మంది యువకులు తక్కువ వేతనాలతో పనిచేయడం లేదా ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల పాటు ఎదురుచూడడం సాధారణం అయింది. ఇది కేవలం ఉపాధి సమస్య కాదు; దేశ మానవ వనరుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేకపోతున్నామనే సంకేతం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి కూడా మిశ్రమంగానే ఉంది. వ్యవసాయం ఇంకా కోట్లాది కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. కానీ వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, అస్థిర మార్కెట్ ధరలు రైతుల ఆదాయాలను ప్రభావితం చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం ఆశించిన స్థాయిలో పెరగకపోవడం దేశీయ డిమాండ్‌పై ప్రభావం చూపుతోంది. ఒక ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలంటే పట్టణాలతో పాటు గ్రామీణ మార్కెట్లు కూడా బలోపేతం కావాలి. ఇక ఆదాయ అసమానత... గత దశాబ్దంలో భారత్‌లో సంపద సృష్టి వేగవంతమైంది. అయితే ఆ సంపద పంపిణీ సమానంగా జరగలేదనే విమర్శలున్నాయి. కొద్దిమంది చేతుల్లో భారీ సంపద కేంద్రీకృతమవగా, అధిక జనాభా ఇంకా పరిమిత ఆదాయాలతో జీవిస్తోంది. దీర్ఘకాలంలో ఇది సామాజిక, ఆర్థిక సవాళ్లకు దారితీసే అవకాశం ఉంది. ఎందుకంటే స్థిరమైన వృద్ధికి విస్తృతమైన మధ్యతరగతి, బలమైన కొనుగోలు శక్తి అవసరం. అయితే ఆశాజనక అంశాలు కూడా తక్కువ కావు. విదేశీ మారక నిల్వలు బలంగా ఉన్నాయి. బ్యాంకింగ్ రంగం గతంతో పోలిస్తే ఆరోగ్యకర స్థితిలో ఉంది. డిజిటల్ చెల్లింపులు, తయారీ రంగ విస్తరణ, స్టార్టప్, ఎకోసిస్టమ్, మౌలిక సదుపాయాల పెట్టుబడులు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయి. ప్రపంచ సరఫరా గొలుసుల్లో చైనాకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను చూడాలనే ఆసక్తి కూడా పెరుగుతోంది. కాబట్టి భారత్ ప్రస్తుతం ఆర్థిక సంక్షోభం అంచున నిలిచిన దేశం కాదు. అదే సమయంలో అన్ని సమస్యలను అధిగమించి సంపూర్ణ విజయాన్ని సాధించిన దేశం కూడా కాదు. ఇది ఒక పరివర్తన దశ. వృద్ధి ఉంది, కానీ అది అందరికీ సమానంగా చేరడం లేదు. అవకాశాలు ఉన్నాయి, కానీ వాటిని ఉపాధి, ఆదాయం, జీవన నాణ్యతగా మార్చే సవాలు ఇంకా మిగిలే ఉంది. అందువల్ల నేటి భారత ఆర్థిక వ్యవస్థపై అడగాల్సిన ప్రశ్న 'జీడీపీ ఎంత పెరిగింది?' అని కాదు. 'సామాన్య భారతీయుడి జీవితం ఎంత మెరుగుపడింది?' అని. ఆ ప్రశ్నకు ధైర్యంగా, గర్వంగా సమాధానం చెప్పగలిగిన రోజే భారత్ కేవలం పెద్ద ఆర్థిక వ్యవస్థగా కాకుండా, నిజమైన ఆర్థిక మహాశక్తిగా గుర్తింపు పొందుతుంది.

# సమిష్టి కృషితోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యం





"అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం
"సందర్భంగా యాంటీ డ్రగ్స్ 3కె రన్ నిర్వహణ
3కె రన్‌కు జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఎమ్మెల్యే డా. ఎం. సంజయ్ కుమార్

**నవగీతం,జూన్26,(జగిత్యాల ప్రతినిధి)** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీస్ మరియు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో గురువారం యాంటీ డ్రగ్స్ 3కె రన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. ఎం. సంజయ్ కుమార్, జిల్లా అధికారులు, వైద్యులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివేకానంద స్టేడియం (ఓల్డ్ బస్ స్టాండ్) నుంచి ప్రారంభమైన 3కె రన్‌ను జిల్లా ఎస్పీ, ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. టవర్ సర్కిల్, న్యూ బస్ స్టాండ్ మీదుగా ఐఎంఏ హాల్ వరకు కొనసాగిన ఈ రన్‌లో వందలాది మంది యువత ఉత్సాహంగా పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనపై తమ వంతుపాత్ర నిర్వహిస్తామని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తును




కూడా దెబ్బతీసే అత్యంత ప్రమాదకరమైన వ్యసనమని అన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి విద్య, క్రీడలు, ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో డ్రగ్స్ విక్రయం, రవాణా, వినియోగంపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని, ప్రజలు కూడా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. జగిత్యాల ఎమ్మెల్యే డా. ఎం. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖలు సమిష్టిగా పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ "డ్రగ్స్‌కు నో చెప్పుదాం -- ఆరోగ్యవంతమైన, సురక్షితమైన సమాజాన్ని నిర్మిద్దాం" అనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం 3కె రన్‌లో విజేతలుగా నిలిచిన యువతకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజా గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సామిండ్ల వాణి శ్రీనివాస్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఐఎంఏ జగిత్యాల అధ్యక్షులు డా. గుడూరి హేమంత్, కార్యదర్శి డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి డా. కోటగిరి సుధీర్ కుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## దేశాయి బీడీ ఫ్యాక్టరీని మెట్ పల్లి నుండి కోరుట్ల కు తరలించవద్దు

-తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు




**నవగీతం, జూన్26,(మెట్ పల్లి ప్రతినిధి)** మెట్ పల్లి డివిజన్ కేంద్రంలోని బీడీ ఫ్యాక్టరీని కోరుట్ల కు తరలించవద్దని మెట్ పల్లిలో యధావిధిగా కార్మికులకు పని కల్పించాలని బీడీ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు బీడీ యజమాన్యాన్ని కోరారు శుక్రవారం రోజున మెట్ పల్లి పట్టణంలో ని కార్మిక శాఖ అధికారి కి వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మెట్ పల్లి డివిజన్ పరిధిలో ని దేశయి బ్రదర్స్ లిమిటెడ్ బీడీ సెంటర్లో 45 బ్రాంచీలలో 2500 మంది ఫ్యాక్టరీలో బీడీ కార్మికులుగా ఉపాధి పొందుతున్నారు అన్నారు ఇదే ఫ్యాక్టరీలో 12 మంది బీడీ ప్యాకింగ్ వర్కర్లు పదిమంది మహిళా బీడీ చాటన్ వర్కర్లు మిగతా నెలసరి ఉద్యోగులు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుంటారన్నారు గత 35 సం, మెట్ పల్లి లో నడుస్తున్న బీడీ ఫ్యాక్టరీని ఎలాంటి నోటీసు లేకుండా జులై 1 నుండి కోరుట్ల డివిజన్ కేంద్రమునకు తరలించుటకు బీడీ యజమాన్యం సొంత నిర్ణయం తీసుకుంది ఈ తప్పుడు ఆలోచన విధానం వలన బీడి టేకదారులు మెట్ పల్లి ఇబ్రహీంపట్నం మండలాల చుట్టూ ఉన్న గ్రామాల నుండి బీడీ గంపలు 10 నుండి 35 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి తీసుకురావాల్సి ఉంటుంది అలాగే మహిళా బీడీ చెక్కర్స్, ప్యాకర్స్ వర్కర్స్ ఉదయం 8 గంటల డ్యూటీకి చేరుకోలేని పరిస్థితి, బస్సు షెల్టర్ కూడా అందుబాటులో లేని దుస్థితి ఉన్నది అన్నారు ఈ బీడీ ఫ్యాక్టరీ సెంటర్ తరలింపు వల్ల ఈ సెంటర్లో పనిచేసే వారందరికీ ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. యజమాన్యం వీరందరినీ బెదిరింపులకు గురి చేస్తూ పనులనుండి తొలగిస్తామని సెంటర్లు తరలింపును అడ్డుకున్న వారికి కంపెనీలు బంద్ చేస్తామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు ఇప్పటికే నాసిరకం ఆకుతో నష్టం ఉంది, అనేక రకాల పేరుతో కంపెనీ కోతలతో ఆర్థికంగా నష్టపోతున్న ఈ బీడీ కార్మికులకు మరో ఎదురు దెబ్బ మొదలైంది అన్నారు కావున ఇట్టి బీడీ ఫ్యాక్టరీని తరలిపోకుండా ఎప్పటిలాగే నడిపించాలని బీడీ టేకదారులు బిడి చాటన్ , బీడీ ప్యాకింగ్ వర్కర్స్ అలాగే బీడీలు చుట్టే కార్మికులు కోరుతున్నారని ఈ విషయంలో జిల్లా లేబర్ అధికారులు జోక్యం చేసుకొని బీడీ ఫ్యాక్టరీని తరలింపు నిలిపివేయాలని బీడీ కార్మికులకు ఆర్థికంగా నష్టపోకుండా చూస్తూ బీడీ యజమాన్యంపై చట్టరీత్య చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు లేనియెడల బీడీ కార్మికుల చేత ఆందోళన. ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎండి మౌలానా జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత ఉపాధ్యక్షులు మునుగోరి హనుమంతు, జిల్లా కోశాధికారి ఎండి ముక్రం, ఎండి అలీ, ఎండి ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు

## రాజ్యాంగ విలువలను, లౌకిక స్ఫూర్తిని బీజేపీ దెబ్బతీస్తోంది: సీపీఎం ధ్వజం

కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై మండిపాటు
తల్లాడలో ముగిసిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు




**నవగీతం,జూన్26, (తల్లాడ ప్రతినిధి):** దేశంలోని ప్రజల వైవిధ్యం, రాజ్యాంగ విలువలు, మరియు లౌకిక స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను దేశ ప్రజలపై బలవంతంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తోందని సీపీఎం జిల్లా రాజకీయ అకాడమిక్ సెల్ బాధ్యులు బోడపట్ల రవీందర్ తీవ్రంగా విమర్శించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో, సీపీఎం సత్తుపల్లి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మాచర్ల భారతి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతులు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ క్లాసులకు ప్రిన్సిపాల్‌గా శీలం సత్యనారాయణ రెడ్డి వ్యవహరించారు.?ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన బోడపట్ల రవీందర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రజల అసలు సమస్యలైన నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతులు--కార్మికుల ఇబ్బందుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేలా ఉన్నాయని ఆరోపించారు. మతం, కులం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలకు బదులుగా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధానాలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరారు. ఆర్ఎస్ఎస్‌ను ఒక ఎన్‌జీఓ సంస్థగా బీజేపీ అభివర్ణించడం శోచనీయమన్నారు. జాతీయ ఎన్నికల కమిషన్, ఈడీ, సీబీఐ వంటి స్వతంత్ర సంస్థలను పావులుగా వాడుకుంటూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని, రాజ్యాంగ హక్కులను ధ్వంసం చేస్తోందని మండిపడ్డారు. భారత రాజ్యాంగం కల్పించిన లౌకిక, ప్రజాస్వామ్య, సమానత్వ విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజల హక్కుల కోసం సీపీఎం ప్రజాస్వామ్య పద్ధతుల్లో తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.?ఈ శిక్షణా తరగతుల్లో సీపీఎం సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ మాచర్ల భారతి, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, చలమాల విఠలరావు, జాజిరి శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు, తన్నేరు కృష్ణార్జునరావు, అయినాల రామలింగేశ్వర రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, మాదాల వెంకటేశ్వరరావు, జాజిరి జ్యోతి, అరవపల్లి జగన్మోహన్రావు, రావుల రాజబాబు, శీలం కరుణ, నాగమణి, కృష్ణవేణి, రజిని, మోహన్ రావు, తమ్మిశెట్టి శ్రీను, ప్రతాప్, నాగేశ్వరరావు మరియు స్థానిక ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి..



**నవగీతం, జూన్26,ధర్మపురి:** మొహర్రం సందర్భంగా రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం ధర్మపురిలో మొహర్రం వేడుకలు పాల్గొన్నారు. ఈసందర్భంగా పట్టణంలోని నంది చౌరస్తాలో పీరీలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక సంవత్సరాలుగా హిందూ, ముస్లీంలు సోదరభావంతో కలిసి పీర్ల పండుగ జరుపుకుంటారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజాస్వామ్యా దేశంలో భవిష్యత్తు తరాల కోరకు ఇదే సంస్కృతిని కొనసాగించాలని మంత్రి కోరారు.

## మాదిగ సమాజ అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధం : దుమాల గంగారాం మాదిగ



**నవగీతం,జూన్26,(కొడిమ్యాల ప్రతినిధి)** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని సంద్రాలపల్లి గ్రామంలో గోటు విలేజ్ ఆధ్వర్యంలో మాదిగ ప్రజల సమావేశం నిర్వహించారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కొడిమ్యాల మండల అధ్యక్షుడు బండారి నరేష్ మాదిగ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం మాదిగ మాట్లాడుతూ, మాదిగ సమాజ అభ్యున్నతికి విద్యే ప్రధాన ఆయుధమని అన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులతో పాటు వివిధ కారణాల వల్ల చదువులకు దూరమైన వారిని కూడా తిరిగి విద్యాభ్యాసం కొనసాగించేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అలాగే, జూలై 7న జరగనున్న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు బోనగిరి కిషన్ మాదిగ, కొడిమ్యాల మండల అధికార ప్రతినిధి బొక్కెం శ్రీనివాస్ మాదిగ, బెక్కం బాబు, ఆలియాలు సురేష్, మాల్యాల పవన్, త్రైదల రామ్, బెక్కం సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడలో ముమ్మరంగా ఓటర్ల సవరణ కార్యక్రమం



**నవగీతం. జాన్26, (తల్లాడ ప్రతినిధి):** తల్లాడ మండల పరిధిలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ స్థాయి అధికారులు బి ఎల్ ఓ స్థానిక ఓటర్లను కలిసి ఓటు హక్కు ప్రాధాన్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు.?అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తప్పుల సవరణ కోసం సంబంధిత ఫారాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ వస్తున్న బీఎల్ఓలకు మండల ప్రజలు, ఓటర్లు పూర్తి స్థాయిలో సహకరించి తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

తహసిల్దార్ డి నరేష్



**నవగీతం, జాన్ 26.(కొడిమ్యాల ప్రతినిధి)** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమాన్ని క్రమశిక్షణతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్థానిక తహసీల్దార్ నరేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నాచుపల్లి, హిమ్మతరావుపేట, రాంసాగర్, కొడిమ్యాల, పూడూరు గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) నిర్వహిస్తున్న ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని తహసీల్దార్ స్వయంగా పరిశీలించారు. గ్రామ ప్రజలతో మాట్లాడి ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బీఎల్‌వోలకు అవసరమైన ఈఎఫ్. ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ నరేష్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి దరఖాస్తును ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలించి, నిర్ణీత గడువులోగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎల్‌వోలకు పలు సూచనలు, సలహాలు అందించారు.

## జులై 1న గ్రామపంచాయతీల వద్ద ధర్నాను జయప్రదం చేయండి:




**నవగీతం,జూన్26,( తల్లాడ ప్రతినిధి):** తల్లాడ మండల కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 'విబి-జి గ్రామ్ జి' చట్టాన్ని వ్యతిరేకిస్తూ జులై 1న గ్రామ గ్రామాన నిరసనలు, గ్రామపంచాయతీల వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.?ఈ కొత్త పథకం వల్ల నిధుల కొరత ఏర్పడి ఉపాధి హామీ పూర్తిగా మూతపడే ప్రమాదం ఉందన్నారు. ఆన్లైన్ నిబంధనలు, డ్రోన్ల నిఘాను రద్దు చేసి పాత ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే రోజువారీ కూలీ రూ.400 ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తన్నీరు కృష్ణార్జునురావ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
27 జూన్ 2026

# వైద్యానికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం..





**ఏఎన్ఎం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం..**

**రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

**నవగీతం, జూన్26, బీర్ పూర్:** ప్రజలు ఆశీర్వదించి ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి మంత్రి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పేదలకు అందుబాటులో వైద్యాన్ని తీసుకురావడానికి అనేక చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో పాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో జగిత్యాల జిల్లాలో సర్కారు వైద్యాన్ని అన్ని వర్గాల ప్రజలకు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజ్ నిర్మాణంతో పాటు 450 పడకల ఆసుపత్రి నిర్మాణం చేస్తున్నామని మంత్రి తెలిపారు. జగిత్యాలలో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తూ



జగిత్యాల జిల్లా కేంద్రాన్ని మెడికల్ హబ్ గా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. బీర్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లతో పాటు సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు అడగకుండానే ప్రమాద బీమా కల్పించిందని రాష్ట్రంలోని ఏఎన్ఎంలు ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మారు మూల మండలమైన బీర్ పూర్ అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి తెలిపారు అంతకు ముందు బీర్ పూర్ లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ మారుమూల మండలాల అభివృద్ధి కోరకు ప్రత్యేక నిధులు సాధించి మారుమూల మండలాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రాన్ని వైద్య సేవలకు నిలయంగా మార్చడానికి చేస్తున్న కృషికి మంత్రి అడ్లూరి తో పాటు ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం లభిస్తుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్య సేవలు అందిస్తామని రానున్న రోజుల్లో 24 గంటల పాటు వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వివరించారు.జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఏడాదిలోని బీర్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు పూర్తి చేశామని అన్నారు. పూర్తిస్థాయిలో వైద్య సేవలను బీర్పూర్ లో అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరీష్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శారద, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోళ్ల వాగు ప్రాజెక్టు అటవీ శాఖ అనుమతులు పూర్తి చేస్తాం..





**ఈవానకాలం సీజన్ లో రైతులకు సాగునీరు అందజేస్తాం..**

**అటవీ శాఖ అనుమతి లేకుండానే ప్రాజెక్టు ప్రారంభించిన బీఆర్ఎస్..**

**రోళ్ల ప్రాజెక్టును సందర్శించిన మంత్రి అడ్లూరి..**

**నవగీతం, జూన్26, బీర్ పూర్:** జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలంలోని రోళ్ల వాగు ప్రాజెక్టు సంబంధించిన అటవీశాఖ అనుమతులు పూర్తి చేసి ఈవాన కాలం సీజన్ లో సాగు నీటిని అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తోపాటు నీటిపారుదల శాఖ అటవీ శాఖ అధికారులతో కలిసి రోళ్లవాగు ప్రాజెక్టును మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం చేసే క్రమంలో డీపీఆర్ పూర్తి అయిన తర్వాత ప్రాజెక్టుల నిర్మాణం చేస్తారని అన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో రోళ్లవాగు ప్రాజెక్టుకు ఏలాంటి డీపీఆర్ లేకుండానే పనులు ప్రారంభించారని మంత్రి అడ్లూరి ఆరోపించారు. 2016లో ఏలాంటి అనుమతులు లేకుండా అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు గారు పనులు ప్రారంభించారని మంత్రి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. రూ. 60 కోట్లతో ప్రారంభించిన రోళ్ల వాగు ప్రాజెక్టు 2023 డిసెంబర్ వరకు రూ. 153 కోట్లకు పెంచారని అన్నారు. అంచనాలు పెంచినప్పటికీ రోళ్ల వాగు ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయలేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావు మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ ప్రాజెక్ట్ లు పూర్తి చేసుకున్నారని ధర్మపురి నియోజకవర్గ ప్రాజెక్టులను మాత్రం పెండింగ్ లో పెట్టారని మంత్రి అడ్లూరి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోళ్ల వాగు ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించి అన్నదాతలకు సాగునీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం నిర్మాణ సంస్థకు ఇవ్వాల్సిన రూ. 40కోట్లు చెల్లించడంతో పాటు రెవెన్యూకు సంబంధించిన 800 ఎకరాల భూమిని అప్పగించడం జరిగిందని మంత్రి వివరించారు. రిజర్వు ఫారెస్ట్ అనుమతుల కోసం రూ. 32 లక్షలు డిపాజిట్ చేయడం జరిగిందని మంత్రి వివరించారు. రిజర్వ్ ఫారెస్ట్ అనుమతులతో పాటు అటవీ శాఖ అనుమతులు సాధించి ఈవానకాలంలో సాగునీటిని రైతులకు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. 15 రోజుల్లో ప్రాజెక్టు కు గేట్లు బిగించి పాయింట్.25 టీఎంసీల నీటిని నిలువ చేసి రైతులకు వానకాలం సీజన్ లో సాగు నీటిని అందిస్తామని మంత్రి తెలిపారు. రోళ్లవాగు ప్రాజెక్టు కాల్వ లైనింగ్ పనులకు అంచనాలు తయారు చేయాలని మంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. యుద్ధ ప్రాతిపాదికన గేట్ల బిగింపు చేపట్టి రైతులకు సాగునీటిని అందించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

# తెలంగాణ రైతులకు శుభవార్త

# ఒకేసారి 'రైతుభరోసా' నిధులు రిలీజ్

**హైదరాబాద్** : తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని ఈసారి రైతుల ఖాతాల్లో ఒకేసారి జమ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మధిర నియోజకవర్గ పరిధిలోని చింతకాని మండలంలో ఈ నెల 30న నిర్వహించనున్న 'రైతు ఆశీర్వాద సభ'లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నిధులను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రభుత్వం అధికారికంగా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకం కింద ఎకరాకు రూ. 6 వేల చొప్పున, రెండు సీజన్లలో కలిపి మొత్తం రూ. 12 వేల పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయనుంది.ఈ వానాకాలం సీజన్‌లో రైతుభరోసా లబ్ధి పొందడానికి ప్రభుత్వం కీలక విధివిధానాలను ఖరారు చేసింది. ఈ నెల 15వ తేదీ నాటికి 'భూభారతి' పోర్టల్‌లో భూమి వివరాలు నమోదై, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సీసీఎల్ఏ నుంచి అనుమతులు పొందిన రైతులకు మాత్రమే ఈ సాయం అందుతుంది. అలాగే, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన గిరిజన రైతులు కూడా ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ నుంచి అనుమతులు పొంది ఉండాలి. అర్హులైన రైతుల రికార్డులను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఒక జిల్లా పరిధిలోనే దాదాపు 3.58 లక్షల మంది రైతులు లబ్ధిదారులుగా ఉండగా, వారి కోసం రూ. 460 కోట్ల నిధులు అవసరమని అధికారులు



అంచనా వేస్తున్నారు. ఈ జాబితాలో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన 3,906 మంది రైతులు కూడా ఉన్నారు.

## విద్యార్థులను అభినందించిన మంత్రి అడ్లూరి..



**నవగీతం,జూన్26,ధర్మపురి:** అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల విద్యార్థులను రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందించారు. మే 29నుండి 31వరకు నేపాల్ దేశం కాట్మాండ్ లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్స్ షిప్ పోటీలల్లో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన రూషగాని వినూత్న అండర్ 9-10 బాలికల స్పారింగ్ విభాగంలో ప్రథమ స్థానం నిలువగా అండర్ 14-15 బాలికల స్పారింగ్ విభాగంలో వి నిహారిక ప్రథమ స్థానంలో నిలవగా దాసరి ధనస్విని 9-10 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు.ఓదెల గ్రామానికి చెందిన లాగిశెట్టి శరణ్య 16-17 బాలికల స్పారింగ్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచి బ్రౌంజ్ మెడల్ సాధించగా అండర్ 17-18 బాలికల స్పారింగ్ విభాగంలో ఎంబడి చందన తృతీయ స్థానం స్థానం బ్రౌంజ్ సాధించారు. కరాటే మాస్టర్ కాలువల రమేష్ ఆధ్వర్యంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కలువగా వీరిని మంత్రి లక్ష్మణ్ కుమార్ అభినందించారు.

## అయోధ్య విరాళాల్లో అవినీతి

**హైదరాబాద్ :** అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల సేకరణలో ఏకంగా రూ. 200 కోట్ల భారీ అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రస్ట్‌లో ఎలాంటి అక్రమాలు జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పినప్పటికీ... యూపీ సిట్ పోలీసులు ఆయన సొంత మనుషులనే అరెస్ట్ చేశారని తెలిపారు. కేవలం చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను పదవుల నుంచి తప్పించి బీజేపీ చేతులు దులుపుకుంటే సరిపోదని, ఈ స్కామ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని, దేవుడి కోసం సేకరించిన విరాళాల సొమ్ముతో బీజేపీ రాజకీయాలు చేస్తోందని చామల మండిపడ్డారు. బెంగాల్‌లో మమతా బెనర్జీకి చెందిన 20 మంది ఎంపీలను, మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రేకు చెందిన ఆరుగురు ఎంపీలను ఒక్కొక్కరికీ రూ. 75 కోట్లు ఇచ్చి కొనుగోలు చేయడానికి ఈ రాముడి సొమ్మునే వాడారంటూ తీవ్రస్థాయిలో ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కాపాడారని... ఇప్పుడు చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను కేవలం పదవుల నుంచి తప్పిస్తే సరిపోదని అన్నారు.

## 'గోల్డ్ మ్యాన్' సూర్య భాయ్‌పై చీటింగ్ ఆరోపణలతో కేసులు

**హైదరాబాద్ :** సోషల్ మీడియాలో ఒంటినిండా బంగారంతో మెరిసిపోతూ 'గోల్డ్ మ్యాన్'గా గుర్తింపు తెచ్చుకున్న పి. సురేశ్ కుమార్ అలియాస్ సూర్య భాయ్‌పై హైదరాబాద్ పోలీసులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. తక్కువ ధరకే దిగుమతి చేసుకున్న బంగారం ఇప్పిస్తానని చెప్పి పలువురిని మోసగించినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తనకు అత్యంత సన్నిహితులని నమ్మించి, మార్కెట్ రేటు కంటే తక్కువకే బంగారం ఇస్తానని చెప్పి డబ్బులు వసూలు చేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకున్నాక బంగారం ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఒక బాధితుడి నుంచి రూ.32 లక్షలు వసూలు చేసిన సూర్య భాయ్, ఆ తర్వాత బంగారం ఇవ్వలేదు. బాధితులు అతని ఇంటికి వెళ్లి నిలదీయగా, వారికి మూడు ఐఫోన్లు ఇచ్చి, రూ.20 లక్షలకు చెక్కు రాసిచ్చాడు. అయితే, ఆ తర్వాత వారిని బెదిరించి ఫోన్లను తిరిగి లాక్కున్నట్టు బాధితులు తమ ఫిర్యాదులో వివరించారు. ఈ ఘటనపై మొదట అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు కాగా, కేసును నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.దీంతో పాటు పోలీసులకు తప్పుడు సమాచారం ఇచ్చి ఫిర్యాదు చేసినందుకు గాను సూర్య భాయ్‌పై మరో కేసు కూడా నమోదైంది. అతను ఇచ్చిన సమాచారం అవాస్తవమని తేలడంతో పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. ఈ మోసాల వెనుక ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.అత్తాపూర్‌లో నివసించే 34 ఏళ్ల సూర్య భాయ్, ఒంటినిండా బంగారు ఆభరణాలు ధరించి, తెల్లటి దుస్తుల్లో గుళ్లకు వెళ్లే వీడియోలతో సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యాడు. ఈ ఏడాది మార్చిలో ఆదాయపన్ను శాఖ అధికారులు అతనిపై దృష్టి సారించారు. అయితే, వారి తనిఖీల్లో అతను ధరించిన ఆభరణాల్లో చాలా వరకు నిజమైన బంగారం కాదని, చౌకబారు లోహాలతో చేసిన నకిలీవని తేలింది. తాను కోటి రూపాయల విలువైన నగలు ధరించినట్లు అతను చెప్పుకున్నప్పటికీ, అధికారులు జరిపిన విచారణలో వాటి విలువ కేవలం రూ.3 లక్షలు మాత్రమేనని తేలడం గమనార్హం.

## కొనసాగుతున్న బంద్

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రజలకు ముఖ్యమైన గమనిక.. మూడు రోజుల పాటూ రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలగనుంది. ఈ నెల, 27, 28 తేదీల్లో సేవలు నిలిపివేయనున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్, అనుబంధ ఆన్‌లైన్ సేవలకు సంబంధించి సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో తెలియజేశారు. 28న ఆదివారం కావడంతో ప్రభుత్వ సెలవులు వచ్చాయి. ఈ నెల 27న పనిదినం.. ఆ ఒక్కరోజు రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ నెల 29వ తేదీ నుంచి యథావిధిగా సేవలు పునఃప్రారంభమవుతాయని గాంధీ తెలిపారు. ప్రజలు ఇబ్బంది పడకుండా ఈ షెడ్యూల్ రూపొందించామన్నారు.సర్వర్ నిర్వహణ ప్రక్రియతో పాటుగా ఆన్‌లైన్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేసేలా మూడు రోజుల పాటూ పనులు చేపడతామన్నారు. భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం, సేవల్లో నాణ్యత మెరుగుపర్చడం కోసం నిర్వహణ పనులు చేయబోతున్నట్లు తెలిపారు. దాదాపు ఐదేళ్ల తర్వాత ఈ సర్వర్ నిర్వహణ పనులు చేపడుతున్నారు. ప్రజలు ఈ షెడ్యూల్ ప్రకారం రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన పనుల్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు అధికారులు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని కోరారుతెలంగాణలో ప్రతిరోజూ భారీగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి.. ఒకవేళ రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడితే ప్రభుత్వానికి కూడా కొంత నష్టం తప్పదు. అందుకే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఈ సర్వర్ నిర్వహణ పనుల్ని సెలవు దినాల్లో కలిసొచ్చేలా ప్లాన్ చేసింది. అప్పుడు ప్రజలకు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. మూడు రోజుల పాటూ ఈ సర్వర్ నిర్వహణ పనులు చేపడుతుండగా.. ఈ నెల 26న మొహర్రం సెలవు దినం, ఈ నెల 27న మాత్రం పనిదినం, ఈ నెల 28న మళ్లీ ఆదివారం వచ్చింది. దీంతో కేవలం ఒక్కరోజు మాత్రమే ప్రజలకు ఇబ్బంది ఎదురవుతుంది. ఒక్కోరోజు మాత్రమే సేవలు అందుబాటులో ఉండవని అధికారులు చెబుతున్నారు.

## రైతులకు రూ 2లక్షల రుణమాఫీ చేయాలి .

## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్.

**రుద్రవరం. :** రైతులు కౌలు రైతుల పరిష్కారం కోసం ఈనెల 30వ తేదీ జరిగే మహాధర్నాలో రైతులు స్వచ్ఛందంగా పాల్గొని చలోవిజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. శుక్రవారం రైతు సంఘం నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే భాస్కర్ రుద్రవరం మండలం కార్యదర్శి బాల నరసింహుడు మాట్లాడుతూ గత రెండేళ్లుగా మన రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది ఎన్నికల ముందు కూటమినేతలు గుప్పించిన వాగ్దానాలు గాలి

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
27 జూన్ 2026

## బిజినెస్

### భారత్‌లో కొత్త మోటార్‌సైకిళ్ల తయారీ!



అమెరికాకు చెందిన ప్రీమియం బైక్ తయారీ సంస్థ హార్లే డేవిడ్‌సన్, భారతీయ ద్విచక్ర వాహన దిగ్గజం హీరో మోటోకార్ప్ తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నాయి. ఇరు సంస్థలు కలిసి ఎంట్రీ లెవల్ పెర్ఫార్మెన్స్ మోటార్‌సైకిళ్లు, క్రూయిజర్ మోడళ్లను సంయుక్తంగా అభివృద్ధి చేయనున్నాయి. వీటిని భారతదేశంలోనే తయారు చేస్తారు. ఇక్కడి నుండి అంతర్జాతీయంగా, ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు ఎగుమతి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

**హార్లే 'బ్యాక్ టు బ్రిక్స్' వ్యూహం**

2019 నుంచి 2025 మధ్య కాలంలో హార్లే డేవిడ్‌సన్ అంతర్జాతీయ రిటైల్ విక్రయాలు 40 శాతం తగ్గాయి. దీంతో కంపెనీ మార్జిన్లు 18% దెబ్బతిన్నాయి. డీలర్ల లాభాలు ఏకంగా 80% మేర క్షీణించాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు 'బ్యాక్ టు బ్రిక్స్' పేరుతో కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ప్లాట్‌ఫారమ్‌ల ఆధారంగా రాబోయే మూడేళ్లలో 20 కొత్త మోడళ్లు, వేరియంట్లను మార్కెట్లోకి తీసుకురావాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. తద్వారా ప్రీమియం విభాగంలో మరింత విస్తృతంగా వినియోగదారులను చేరుకోవాలని కంపెనీ భావిస్తోంది.

**వ్యూహాత్మకంగా భారత్‌లోకి రీఎంట్రీ**

హార్లే డేవిడ్‌సన్ 2011లో హర్యానాలోని బావల్‌లో ప్లాంట్ ఏర్పాటు చేసింది. నష్టాల కారణంగా 2019లో భారత్‌లో తయారీ కార్యకలాపాలను నిలిపివేసింది. తర్వాత 2020లో హీరో మోటోకార్ప్‌తో లైసెన్సింగ్, పంపిణీ ఒప్పందం కుదుర్చుకుంది. డీల్‌లో భాగంగా మోటార్‌సైకిళ్ల విక్రయం, సర?వసింగ్‌తో పాటు సంయుక్తంగా కొత్త మోడళ్ల రూపకల్పన, తయారీ చేపట్టాలని నిర్ణయించారు. ఈ భాగస్వామ్యంలో తొలి ఉత్పత్తిగా వచ?చన హెచ్‌డీ ఎక్స్440 ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.35 లక్షల నుంచి ప్రారంభమవుతోంది. ఇదే ప్లాట్‌ఫారమ్‌పై హీరో మావ్రిక్ పేరుతో మరో మోడల్‌ను విక్రయిస్తోంది. ఇప్పుడు ఈ భాగస్వామ్యం అంతర్జాతీయ ఎగుమతుల దిశగా కీలక అడుగులు వేస్తోంది. వ్యాపారణ విస్తరణ వ్యూహంపై హార్లే డేవిడ్‌సన్ స్పందిస్తూ.. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో తమ బ్రాండ్ విస్తరణకు హీరో మోటోకార్ప్ కీలక భాగస్వామి అని పేర్కొంది. అయితే కొత్త ఉత్పత్తులపై పూర్తి వివరాలను వెల్లడించలేదు. మరోవైపు హీరో మోటోకార్ప్ సీఈఓ హర్షవర్ధన్ చితాలే మాట్లాడుతూ, ఈ ఏడాది మరిన్ని హార్లే బ్రాండెడ్ మోటార్‌సైకిళ్లు విడుదలవుతాయని ధృవీకరించారు. గ్లోబల్ మార్కెట్లలో అనుకూలత ఉంటే భారత్‌లో తయారైన మోడళ్లను ఇతర దేశాల్లో విక్రయించే నిర్ణయం పూర్తిగా హార్లే--డేవిడ్‌సన్‌దేనని స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎక్స్440, హీరో మావ్రిక్ మోడళ్లు కలిపి దేశంలో 14,375 యూనిట్లు అమ్ముడయ్యాయి. 350సీసీ - 500సీసీ విభాగంలో సుమారు 11 శాతం మార్కెట్ వాటాతో, హీరో మోటోకార్ప్ ప్రస్తుతం బజాజ్ ఆటో, రాయల్ ఎన్‌ఫీల్డ్ తర్వాత మూడో అతిపెద్ద సంస్థగా నిలిచింది. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం, ఈ ప్రీమియం మోటార్‌సైకిల్ విభాగంలో ఆపరేటింగ్ మార్జిన్లు సాఫ్ట్‌వేర్ ఎగుమతుల కంటే అధికంగా ఉండటం గమనార్హం.

**ఏడాది చివర్లో 'హార్లే--డేవిడ్‌సన్ స్ప్రింట్'**

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న హార్లే-డేవిడ్‌సన్ ఎక్స్440, హీరో మావ్రిక్ మోడళ్లకు మంచి ఆదరణ లభించడంతో ప్రస్తు ఆర్థిక సంవత్సరంలో మరిన్ని కొత్త మోడళ్లను విడుదల చేయాలని ఇరు సంస్థలు నిర్ణయించాయి. వీటిలో తొలి మోడల్‌గా 'హార్లే--డేవిడ్‌సన్ స్ప్రింట్' ఈ ఏడాది చివర్లో మార్కెట్లోకి వచ్చే అవకాశముంది. అనంతరం దశలవారీగా మరిన్ని మోడళ్లను ప్రవేశపెట్టనున్నారు. వీటిలో కొన్ని మోడళ్లను భారత్ నుంచి తొలిసారిగా అభివృద్ధి చెందుతున్న అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనున్నట్లు పరిశ్రమ వర్గాల సమాచారం.

# రివర్స్ గేర్‌లో గోల్డ్, సిల్వర్..
# క్రమేణా తగ్గుముఖం పడుతున్న ధరలు

**న్యూఢిల్లీ :** బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. గతకొద్ది నెలలుగా ఆకాశమే హద్దు అన్నట్టు దూసుకుపోయిన రేట్లు.. ఇప్పుడు అంతే వేగంతో దిగొస్తున్నాయి. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో గడిచిన దశాబ్దంలోనే ఎన్నడూలేనంతగా గోల్డ్ విలువ క్షీణించింది. ఇప్పటిదాకా 12 శాతం రేట్లు పడిపోయాయి. 2016 డిసెంబర్ నుంచి చూస్తే.. 3 నెలల వ్యవధిలో ఈ స్థాయిలో ధరల క్షీణత ఇదే. సిల్వర్ వాల్యూ సైతం నాలుగేండ్లలో భారీ పతనాన్ని చవిచూసింది. 17.6 శాతం తగ్గింది. 2022 జూన్ తర్వాత ఇప్పుడే ఇంతటి క్షీణత అంటున్నాయి మార్కెట్ వర్గాలు. నిజానికి వరుసగా 15 నెలలు పరుగులు పెట్టిన పుత్తడి, వెండి ధరలు.. ఒక్కసారిగా రివర్స్ గేర్‌లోకి వెళ్లడంతో మార్కెట్‌లోనూ స్తబ్ధత నెలకొన్నది. కొనుగోలుదారులు వేచిచూసే ధోరణిని అవలంబిస్తున్నారు మరి.

**అంతర్జాతీయ మార్కెట్‌లో..**

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ధరల పతనం స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ ఏడాది జనవరి 28న ఔన్స్ గోల్డ్ ఆల్‌టైమ్ హై రికార్డును సృష్టిస్తూ 5,417 డాలర్లు పలికింది. సిల్వర్ తొలిసారి 117 డాలర్లుగా నమోదైంది. అయితే ఇప్పుడున్న ధరలతో పోల్చితే బంగారం 24 శాతం, వెండి దాదాపు 47 శాతం తగ్గాయి. ప్రస్తుత ట్రెండ్‌నుబట్టి ఇంకా తగ్గవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే భారతీయ మార్కెట్‌లోనూ రేట్లు మరింత దిగివస్తాయన్న అభిప్రాయాలు మార్కెట్ నిపుణుల్లో వ్యక్తమవుతున్నాయి.

**నిపుణుల మాటేంటి?**

అమెరికా డాలర్ బలపడటం, యూఎస్ బాండ్ ఈల్డ్స్ పెరుగడం, ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల పెంపు అంచనాలు.. బంగారం, వెండి ధరల్ని కిందికి లాగుతున్నాయని మెజారిటీ మార్కెట్ విశ్లేషకుల మాట. ఇన్నాళ్లూ తమ పెట్టుబడులకు రక్షణ కవచంగా గోల్డ్, సిల్వర్‌ను భావించిన మదుపర్లు.. వాటిని ఎడాపెడా



కొనేశారు. అయితే తిరిగి అమ్మకాలకు దిగుతుండటం కూడా డిమాండ్‌ను దెబ్బ తీస్తున్నదని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక స్టాక్ మార్కెట్లలో టెక్నాలజీ షేర్లలో నెలకొన్న అమ్మకాల ఒత్తిడి సైతం గోల్డ్, సిల్వర్ రేట్లను దిగజార్చుతున్నాయని చెప్తున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం భయాలూ డౌన్ ట్రెండ్‌కు దారితీస్తున్నాయి. ఇదిలావుంటే అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో ఏర్పడిన సంక్షోభం కూడా గోల్డ్, సిల్వర్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నది. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతల కారణంగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభించిన సంగతి విదితమే. ఇరాన్ దాడులతో గల్ఫ్ దేశాల్లో క్రూడాయిల్, గ్యాస్ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. అందుకే డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక రేట్లు పరుగులు పెట్టాయి. అయితే అమెరికా-ఇరాన్ డీల్.. పరిస్థితుల్ని కొంతమేర అదుపులోకి తెచ్చాయి. దీంతో ముడి చమురు రేట్లూ దిగువముఖం పట్టాయి. ఫలితంగా అధిక ఇంధన ధరలతో ద్రవ్యోల్బణం భయాల మధ్య బంగారం, వెండి కొనుగోలు కోసం ఎగబడ్డ మదుపర్లు.. ఒక్కసారిగా వాటిని అమ్మేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇది కూడా ధరల క్షీణతకు కారణమేనన్న అభిప్రాయాలున్నాయి. గల్ఫ్ వార్‌కు ముగింపు కార్డుపడితే మార్కెట్‌లో పెద్ద కరెక్షనే ఉంటుందన్న అంచనాలూ వస్తుండటం గమనార్హం.

**స్పాట్ మార్కెట్‌లో మరింత తగ్గిన ధరలు**

దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల పతనం కొనసాగుతున్నది. గత మూడు రోజుల్లో 24 క్యారెట్ తులం పుత్తడి రేటు రూ.7,000 పడిపోగా, కిలో వెండి విలువ రూ.19,500 క్షీణించింది. గురువారం ఢిల్లీలో పసిడి ధర రూ.2,800 దిగి రూ.1,45,300గా ఉన్నది. అలాగే వెండి రేటు కిలో రూ.5,000 పడిపోయి రూ.2, 26,000గా నమోదైంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ గోల్డ్ రూ.1,450 తగ్గి రూ.1,29, 550 వద్ద నిలిచింది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 21.15 డాలర్లు క్షీణించి 3,978.06 డాలర్లుగా ఉన్నది. సిల్వర్ 57.10 డాలర్లుగా ట్రేడైంది.

ఈ ఏడాది జనవరి-మార్చిలో 10 శాతం పెరిగిన బంగారం ధర.

ఈ జనవరి-ఫిబ్రవరిలో 28 శాతం ఎగిసిన వెండి రేటు.

జనవరి 29న గోల్డ్, సిల్వర్ రేట్లు ఆల్‌టైమ్ హైగా నమోదు. రూ.1,83,000 పలికిన తులం పుత్తడి, రూ.4,04,500 చేరిన కిలో వెండి.

2025లో 65 శాతం, 2024లో 28 శాతం పుంజుకున్న పసిడి విలువ. వెండి ధరలూ 148 శాతం, 22 శాతం చొప్పున పెరుగుదల.

గత ఏడాది 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.58,750, కిలో వెండి రేటు రూ.1,49,300 వృద్ధి.

### ఆసియా మార్కెట్ల భారీ పతనం.. ఎందుకీ బ్లడ్‌బాత్?



ఇంటర్నెట్ డెస్క్: ఆసియా స్టాక్ మార్కెట్లు నేడు భారీగా కుప్పకూలాయి. అమెరికా మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో భారీగా పతనమయ్యాయి. దక్షిణ కొరియా బెంచ్ మార్కెట్ ఇండెక్స్ కోస్పీ ఏకంగా 8 శాతం మేర పతనం కాగా.. జపాన్‌కు చెందిన నిక్కీ 5 శాతం మేర క్షీణించింది. టెక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఈ పతనానికి కారణమయ్యాయి. నేడు మన మార్కెట్‌లకు సెలవు కావడం గమనార్హం. గిఫ్ట్ నిఫ్టీ మాత్రం శుక్రవారం ఉదయం 100 పాయింట్ల మేర క్షీణించింది. శుక్రవారం నాటి ట్రేడింగ్ సెషనల్‌లో కోస్పీ దాదాపు 8.2 శాతం మేర పతనమైంది. దీంతో ట్రేడింగ్‌ను 20 నిమిషాల పాటు నిలిపివేశారు. అటు జపాన్ నిక్కీ సైతం 5 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.4 శాతం, చైనా బ్లూచిప్ సీఎస్ఐ300 ఇండెక్స్ 2.9 శాతం, షాంఘై కాంపోజిట్ సైతం 2 శాతం మేర క్షీణించాయి. జూన్ 23న కూడా ఇదే తరహాలో ఆసియా మార్కెట్‌లో అమ్మకాలు కనిపించాయి. నేడు మళ్లీ అదే స్థాయిలో మార్కెట్లు పడిపోయాయి. మెమొరీ, స్టోరేజీ చిప్‌ల ధరల కారణంగా యాపిల్ తన ఐప్యాడ్, మ్యాక్‌బుక్ ధరలను భారీగా పెంచిన సంగతి తెలిసిందే. దీంతో ఏఐ మౌలిక వసతుల కల్పనపై చేస్తున్న ఖర్చు, పెరుగుతున్న సెమీ కండక్టర్ల ధరలు బిగ్ టెక్ కంపెనీలనూ వదలడం లేదన్న సంకేతాలను పంపింది. దీంతో యాపిల్ షేరు విలువ నిన్న ఒక్కరోజే 6.1 శాతం మేర క్షీణించింది. 25 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరైంది. ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, అల్ఫాబెట్ షేర్లు కూడా పతనమయ్యాయి. ఈ ఉదంతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాల కోసం భారీగా అప్పులు చేసి పెడుతున్న పెట్టుబడులు దీర్ఘకాలంలో స్థిరంగా కొనసాగుతాయా లేదా అనే అనుమానాలను ఇన్వెస్టర్లలో నెలకొల్పింది. ఏఐ పెట్టుబడులపై ఆలోచనలో పడేసింది. ఈ క్రమంలోనే చైనాకు చెందిన సీఎస్ఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇండెక్స్ 5 శాతం, సీఎస్ఐ 5జీ కమ్యూనికేషన్ ఇండెక్స్ 6.3 శాతం, హాంగ్ సెంగ్ టెక్ ఇండెక్స్ 3.3 శాతం చొప్పున క్షీణించాయి.

# టీ20ల్లో సంచలనం..
# స్వదేశంలో భారత్‌ను చిత్తు చేసిన ఐర్లాండ్!



సంచలనాలకు నెలవైన టీ20ల్లో పెద్ద జట్టైన భారత్‌కు ఐర్లాండ్ ఊహించని షాకిచ్చింది. రెండు మ్యాచ్‌ల సిరీస్ తొలి పోరులో టీమిండియాను 34 పరుగుల తేడాతో ఓడించింది. 183 పరుగుల ఛేదనలో హిట్టర్లతో నిండిన భారత జట్టు అలవోకగా గెలుస్తుందనుకుంటే.. ఐరిష్ బౌలర్లు గొప్పగా కట్టడి చేశారు. మాథ్యూ హెూలార్డ్(3-28)తో మిడిలార్డర్‌ను దెబ్బతీయగా.. అభిషేక్ శర్మ(50),శివం దూబే(25) కాసేప పోరాడాడు. ఫలితంగా సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది ఆతిథ్య జట్టు.

టీ20 వరల్డ్‌కప్‌ను మూడుసార్లు ముద్దాడిన భారత్‌ను చిన్న జట్టైన ఐర్లాండ్ ఓడించింది. స్వదేశంలో బ్యాటుతో, బంతితో, ఫీల్డింగ్‌లోనూ అద్భుతంగా రాణించిన ఐరిష్ టీమ్ సంచలన విజయంతో టీమిండియాకు షాకిచ్చింది. తొలుత ఆడిన ఐర్లాండ్. 183 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. రికార్డు వీరులైన భారత బ్యాటర్ల ముందు ఈ లక్ష్యం ఏం నిలుస్తుంది అనుకున్న వారి అంచనాలు తప్పని ఐర్లాండ్ నిరూపించింది. పొట్టి వరల్డ్‌కప్‌లో ఇరగదీసిన ఓపెనర్ సంజూ శాంసన్(5) బంతిని వికెట్ల మీదకు ఆడుకోగా.. ఇషాన్ కిషన్(1).. శ్రేయస్ అయ్యర్(3) ఇలా వచ్చి అలా వెళ్లారు. ఐరిష్ బౌలర్లు ఒత్తిడి పెంచే ప్రయత్నాన్ని అభిషేక్ శర్మ(50) అర్ధ శతకంతో నీరుగార్చాడు. కానీ బౌన్సర్లు, షార్ట్ పిచ్ బంతులతో టీమిండియా హిట్లర్లకు కళ్లెం వేశారు. సుందర్(9), తిలక్ వర్మ(19) సైతం నిలబడలేదు. చూస్తుండగానే ఐదు వికెట్లు పడడంతో శివం దూబే(25), అక్షర్ పటేల్(15) గెలిపించే ప్రయత్నం చేశారు. ఏడో వికెట్‌కు 35 రన్స్ చేసిన దూబేను మూంద్రా రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. డెలానీ ఓవర్లో సిక్సర్ కొట్టే క్రమంలో టెక్టర్ చేతికి చిక్కాడు అక్షర్. దాంతో.. టీమిండియా ఓటమి ఖాయమైంది. సిక్సర్‌తో ఆశలు రేపిన హర్షిత్ రానా(8) బౌండరీ వద్ద దొరికగా.. 19వ ఓవర్ చివరి బంతికి అర్ష్‌దీప్ సైతం ఔటయ్యాడు. భారత్ 148కే ఆలౌటవ్వగా.. 34 రన్స్ తేడాతో ఐర్లాండ్ గెలుపొందింది. భారత బౌలర్లు పంజా విసిరినా ఐర్లాండ్ భారీ స్కోర్ కొట్టింది. టాస్ ఓడిన జట్టుకు శుభారంభమివ్వాలనుకున్న ఓపెనర్ రాస్ అడైర్(12)ను ఔట్ చేసి హర్షిత్ రానా(3-24) తొలి వికెట్ అందివ్వగా.. హ్యారీ టెక్టర్(0)ను అర్ష్‌దీప్ సింగ్(2-28) పెవిలియన్ పంపాడు. తర్వాతి ఓవర్లో టిమ్ టెక్టర్(17)ను రానా డగౌట్ చేర్చగా 30 పరుగులకే మూడు వికెట్లు పడ్డాయి. ఆ దశలో ఆచితూచి ఆడాలనుకున్న బెంజమిన్ కాలిట్జ్(15)ను దూబే బోల్తా కొట్టించాడు. కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ లొర్కాన్ టక్నర్(50), గరెత్ డెలానీ(49)లు ఆదుకున్నారు. టపటపా నాలుగు వికెట్లు పడిన దశలో టక్నర్, డెలానీ నిలబడ్డారు. మరో వికెట్ పడకుండా.. రన్‌రేటు తగ్గకుండా స్కోర్ బోర్డును నడిపించారిద్దరూ. దూబే ఓవర్లో ఫోర్, డబుల్స్‌లో ఐరిష్ సారథి అర్ధ శతకం సాధించాడు. కానీ హర్షిత్ ఓవర్లో టక్నర్.. తిలక్ వర్మ చేతికి చిక్కడంతో 115 వద్ద ఐదో వికెట్ పడింది. డెత్ ఓవర్లలో గేర్ మార్చిన గెలానీ బౌండరీలు రాబట్టగా.. ఐర్లాండ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేయగలిగింది.

## స్పోర్ట్స్

### లీగ్ దశలో ఒక్క గోల్ ఇవ్వలే..
### ఆరో జట్టుగా మెక్సికో రికార్డు..!



ఆద్యంతం వేడుకలా సాగుతున్న ఫిఫా వరల్డ్‌కప్ 2026లో మెక్సికో చరిత్ర సృష్టించింది. లీగ్ దశలో మూడుకు మూడు మ్యాచుల్లో విజయాలతో నాకౌట్‌కు వెళ్లిన ఆతిథ్య జట్టు.. ప్రత్యర్థిని ఒక్కగోల్ కూడా కొట్టనివ్వలే. తద్వారా.. లీగ్ దశలో శత్రు జట్టుకు ఒక్క గోల్ సమర్పించుకోని జట్టుగా రికార్డు పుస్తకాల్లో నిలిచింది. మొత్తంగా సాకర్ వరల్డ్‌కప్‌లో ఈ అరుదైన ఫీట్ సాధించిన ఆరో జట్టుగా మెక్సికో గుర్తింపు తెచ్చుకుంది. ఈసారి ఫిఫా వరల్డ్‌కప్‌లో రికార్డులు బద్ధలవుతున్నాయి. లీగ్ దశ 33వ మ్యాచ్‌లోనే వంద గోల్స్ నమోదవ్వడం ఓ రికార్డైతే.. ఆతిథ్య మెక్సికో ప్రత్యర్థికి ఒక్క గోల్ ఇవ్వకుండానే నాకౌట్ చేరింది. బుధవారం చెక్ రిపబ్లిక్‌ను 3-0తో చిత్తు చేసి.. హ్యాట్రిక్ విజయాలతో ఔరా అనిపించిన మెక్సికో వరల్డ్‌కప్ చరిత్రలో అరుదైన ఫీట్ సొంతం చేసుకుంది. ఇదివరకూ నెదర్లాండ్స్(1974), బ్రెజిల్(1986), ఇటలీ(1990), అర్జెంటీనా(1998), ఉరుగ్వే (2018).. ఈ ఐదు జట్లు మాత్రమే లీగ్ దశలో ప్రత్యర్థిని ఒక్క గోల్ కొట్టనివ్వలేదు.

గ్రూప్ ఏలోని మెక్సికో తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను 0-2తో ఓడించింది. రెండో గేమ్‌లో దక్షిణ కొరియాను వణికిస్తూ 1-0 విజయం సాధించింది. బుధవారం చెక్ రిపబ్లిక్‌ను 3-0తో ఓడించిన మెక్సికో నాకౌట్ బెర్తు పట్టేసింది. మూడు విజయాలు.. ఆరు పాయిట్లతో అగ్రస్థానం దక్కించుకుంది మెక్సికో. 32వ రౌండ్ తొలి మ్యాచ్‌లో మంగళవారం ఎస్తాడియో అజ్టెకాను ఎడ్సన్ అవ్వరెజ్ సారథ్యంలోని మెక్సికో ఢీకొట్టనుంది.

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
27 జూన్ 2026



# 6 క్యారవాన్లు, 50 మంది అసిస్టెంట్లు..
# విజయ్ దేవరకొండ డిమాండ్ వార్తలపై స్పందించిన నిర్మాత

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆయన నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇటీవల ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్‌గా మారాయి. 'రణబాలి' చిత్రీకరణ సమయంలో విజయ్ దేవరకొండ ఐదు కారవాన్లు ఏర్పాటు చేయాలని కోరారని, తన వెంట పెద్ద సంఖ్యలో అసిస్టెంట్లు ఉండాలని డిమాండ్ చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వార్తలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. ఈ ప్రచారంపై ఇప్పటికే విజయ్ దేవరకొండ బృందం స్పందించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. హీరోపై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొంది. అసత్య కథనాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని విజయ్ టీమ్ హెచ్చరించింది. తాజాగా ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి కూడా స్పందించారు. షూటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, విజయ్ దేవరకొండ నుంచి అసాధారణమైన డిమాండ్లు ఏవీ రాలేదని ఆయన స్పష్టం చేశారు. విజయ్ ఎప్పుడూ పనిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తారని, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తారని నిర్మాత తెలిపారు. ఆయనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఇక 'రణబాలి' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. 1854 నుంచి 1878 మధ్య బ్రిటిష్ పాలన కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'రణబాలి' చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తయింది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, కాన్సెప్ట్ విజువల్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రాల్లో ఒకటిగా 'రణబాలి' రూపొందుతున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## ఉత్కంఠను కలిగించేలా 'తత్వం' ట్రైలర్



కొత్త కథలు, వినూత్నమైన కథలకు తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఆదరణ ఉంటుంది. సినిమా చూస్తున్నంత సేపు వాళ్లని ఎంగేజ్ చేయగలిగితే ఆ సినిమా చిన్నదైనా పెద్ద విజయాన్ని అందిస్తారు. ముఖ్యంగా మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటుంది. ఇప్పుడు ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశాలతో రాబోతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎడిటర్ విప్లవ్ నైషదం మాట్లాడుతూ " ఈ సినిమా జర్నీ ఎంతో స్పెషల్.. ఈ సినిమా కోసం అందరూ ఎంతో కష్టపడ్డారు. అర్జున్ సాఫ్టవేర్‌రంగం నుంచి వచ్చి ఎంతో ఇష్టంతో ఈ సినిమాకు దర్శకత్వం చేశాడు. ఎంతో అనుభవం ఉన్న దర్శకుడిలా ఈ చిత్రాన్ని డీల్ చేశాడు,. ఆద్యంత ఎంతో ఉత్కంఠభరితంగా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు నాకు సంతోషంగా ఉంది' అన్నారు. సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ మాట్లాడుతూ " ఈ రోజుల్లో చిన్న సినిమాల ద్వారా మంచి కంటెంట్‌ను ఇస్తున్నారు. ఆడియన్స్ కూడా ఆదరిస్తున్నారు. ఇది కూడా ఆ కోవలోకి వచ్చే చిత్రమే. ఈ సినిమా అందరికి తప్పకుండా నచ్చుతుంది. మంచి ఎమోషనల్ కనెక్టవిటి ఉన్న థ్రిల్లర్. సంగీతానికి స్కోప్ ఉన్న చిత్రమిది. అర్జున్ ఎంతో ప్రతిభ ఉన్న దర్శకుడు' అన్నారు. నిర్మాత వంశీ సీమకుర్తి మాట్లాడుతూ " ట్రైలర్ అందరికి నచ్చింది. సినిమా కూడా చాలా బాగుంటుంది. దర్శకుడు అనుకున్నది అనుకున్నట్లుగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు. ఈసినిమా మంచి అవుట్ పుట్ రావడానికి అందరూ సహకరించారు. అందరూ ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ " ఈ మూవీ టైటిల్, కాన్సెప్ట్‌ను మన చుట్టు జరుగుతున్న ఇన్‌సిడెంట్స్ ఆధారంగా తయారుచేసుకున్నాను. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ ఇది. దినేష్ తేజ్ వినగానే వెంటనే ఓకే చేశాడు. ఈ సినిమా కోసం అందరూ దిబెస్ట్ ఇచ్చారు. కథ తప్పకుండా అందర్ని ఎంగేజింగ్‌గా ఉంటుంది. వంశీ గారి అన్వేషణ తరహాలోనే అందర్ని కట్టిపడేసే సినిమా ఇది. ఈ సినిమాలో ఉంటే ట్విస్ట్ ఆడియన్స్‌కు షాకింగ్‌గా ఉంటుంది।' అన్నారు. హీరో దినేష్ తేజ్ మాట్లాడుతూ 'నేను కలిసి పనిచేయాలనుకున్న టెక్నిషియన్స్‌తో ఈ సినిమాలో వర్క్ చేశాను. ఈసినిమాతో చాలా మంది కొత్తవాళ్లు పరిచయం అవుతున్నారు. అందరం చాలా కష్టపడ్డాం. అది సినిమా చూసిన తరువాత అందరికి తెలుస్తుంది. ఇక మీద నా సినిమాలకు గ్యాప్ రాదు.




## 4 నెలల్లో షూటింగ్ కంప్లీట్..
## 'వారణాసి'పై రాజమౌళి బిగ్ అప్‌డేట్!

మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.

# తెలంగాణలో జరిగిన వాస్తవ ఘటనలతో 'సర్కారు బాయి'




శ్రీరామ్ నిమ్మల, వర్షిక హీరో హీరోయన్స్ గా నటిస్తున్న సినిమా 'సర్కారు బాయి'. ఈ చిత్రాన్ని డెక్కన్ ఫిలింస్ సమర్పణలో ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి నిర్మిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు లారా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అప్పటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబిస్తూ నీటి సమస్యలు, కుల వివక్ష, అణగారిన వర్గాల జీవిత పోరాటం వంటి అంశాలను దర్శకుడు లారా కళ్లకు కట్టినట్లు తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు హీరో శ్రీరామ్ నిమ్మల పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ మూవీ టీమ్ బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ లో తెలంగాణ పల్లె యువకుడిగా ఎంతో సహజంగా శ్రీరామ్ నిమ్మల కనిపిస్తున్నారు. ప్రస్తుతం "సర్కారు బాయి" సినిమా శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ నెల 17వ తేదీ నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. చేగుంట సమీపంలోని రెడ్డిపల్లి అనే ఊరిలో "సర్కారు బాయి" చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ లెంగ్తీ షెడ్యూల్ లో సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రొడ్యూసర్ తుమ్మల ప్రఫుల్ రాం రెడ్డి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా హై క్వాలిటీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మిస్తున్నారు. హీరో శ్రీరామ్ నిమ్మల, హీరోయిన్ వర్షిక, ముఖ్య నటీనటులు బాహుబలి ప్రభాకర్, నాగ మహేష్ లపై సీన్స్ షూటింగ్ చేస్తున్నారు. జూలై నెలాఖరు వరకు ఈ భారీ షెడ్యూల్ కొనసాగనుంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో మేకర్స్ వెల్లడించనున్నారు.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.